PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 311 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 04 నవంబర్ 2026

డంపింగ్ యార్డు శాశ్వత ఎత్తివేతకు అఖిలపక్ష కార్యాచరణకు జేపీసీ స్వాగతం



3లో

షిర్డీలో సీనియర్ జర్నలిస్ట్ సావల్కర్‌కు ఘన సన్మానం


3లో

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై
సర్కారు దృష్టి

● మహారాష్ట్రతో నిరంతర చర్చలు జరపాలి ● ముంపు భూముల వివరాలు, పరిహారంపై పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలి ● సాగునీటి శాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



హైదరాబాద్,నవంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్): తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూముల వివరాలు, పరిహారం చెల్లింపు, గతంలో కుదిరిన ఒప్పందాలు తదితర అంశాలపై పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ విషయంలో ఎలాంటి సందిగ్ధత లేకుండా అవసరమైన పత్రాలను సిద్ధం చేసి మహారాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలని స్పష్టం చేశారు.మంగళవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి తుమ్మిడిహెట్టి బ్యారేజీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాష్ట్రతో ఇటీవల జరిపిన చర్చలు, ప్రాజెక్టుకు సంబంధించిన మిగతా2లో...

శాసనమండలి ప్రాంగణం అభివృద్ధికి
కార్యాచరణ

- పర్యావరణహిత, సుస్థిర అభివృద్ధికి ప్రాధాన్యం: సీఎస్ సంజయ్ జాజు


2లో

ప్రకృతి తెచ్చిన కరువు కాదు.. పాలకులు
సృష్టించిన కరువు!

● కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడంతోనే రైతులకు సాగునీటి కష్టాలు ● గోదావరి, కృష్ణా నుంచి సముద్రంలోకి వృథాగా వెళ్తున్న వందల టీఎంసీల నీరు ● కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు



హైదరాబాద్,నవంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో నదులు ప్రవహిస్తున్నా రైతుల పొలాలకు సాగునీరు అందకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించారు. కేసీఆర్‌పై రాజకీయ కక్షతోనే కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను నిర్లక్ష్యం మిగతా2లో...



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు గడువు పొడిగింపు

- నామినేషన్ల దాఖలు చివరి రోజు వరకు దరఖాస్తుకు అవకాశం

హైదరాబాద్,నవంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువును పొడిగిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తి పలువురు పట్టభద్రులు నమోదు మిగతా2లో...


అర్హులైన పేదలందరికీ
ఇందిరమ్మ ఇండ్లు

నియోజకవర్గానికి 5,500 ఇళ్లు.. ఉపాధి ఉన్న ప్రాంతాల్లోనే నిర్మాణాలు

వచ్చే బోనాల నాటికి గృహప్రవేశాలు..

ఈ-లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక


2లో



కేసీఆర్ పాలనలో తెలంగాణ
సంపద దోపిడీ

- 74 వేల ఉద్యోగాలు కల్పించాం.. మరోసారి భూసర్వేకు చర్యలు: పొంగులేటి



హైదరాబాద్,నవంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర సంపదను స్వార్థ ప్రయోజనాల కోసం కొల్లగొట్టారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారంలో ఉన్న కేసీఆర్ పేదల కష్టాలను పట్టించుకోలేదని విమర్శించారు. ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లిలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.**మరిన్ని ఉద్యోగాలు కల్పిస్తాం** ప్రతిపక్ష నేతలు తమ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను మంత్రి ఖండించారు. గతంలో వరి సాగు చేసే రైతులను నిరుత్సాహపరిచారని, మిగతా2లో...

సైబర్ నేర ముఠాలపై
ఉక్కుపాదం

- 13 రాష్ట్రాలు, 11 కేంద్ర సంస్థలతో హైదరాబాద్‌లో సమన్వయ సమావేశం



హైదరాబాద్,నవంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్): దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న సైబర్ నేర ముఠాలను కట్టడి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ), తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని టీజీఐసీసీసీలో జాయింట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ టీమ్ (జేసీసీటీ-4) సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి 13 రాష్ట్రాల నుంచి 45 మంది పోలీసు అధికారులు, 11 కేంద్ర, ఇతర సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రాల మధ్య సమాచార మార్పిడి, సైబర్ నేరాల కేంద్రాల గుర్తింపు, నేర ముఠాలపై ఉమ్మడి దర్యాప్తు, సంయుక్త దాడులపై చర్చించారు. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ సమావేశాన్ని ప్రారంభించగా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, మిగతా2లో...

ఏపీలో కూటమికే పట్టం!

● పట్టణ స్థానిక సంస్థల్లో ఆధిక్యం!
● కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టీడీపీ కూటమి హవా
● జగన్ సొంత జిల్లా కడపలోనూ కూటమి ఆధిపత్యం
● నందికొట్కూరులో వైసీపీ విజయం.. అనంతపురంలో బీజేపీకి ఎదురుదెబ్బ

అమరావతి,నవంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్): ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో అధికార టీడీపీ నేతృత్వంలోని కూటమి ఆధిక్యం ప్రదర్శించింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కూటమి అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో ముందంజలో నిలిచారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు పలు ప్రాంతాల్లో ఆధిక్యం కనబరిచారు. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లా కడపతో పాటు ఆయన సొంత నియోజకవర్గం పులివెందులలోనూ టీడీపీ కూటమి అభ్యర్థులు పైచేయి సాధించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. **కార్పొరేషన్లలో కూటమి ఆధిక్యం** రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపులో కూటమి అభ్యర్థులు మిగతా2లో...

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై సర్కారు దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

వివిధ అంశాలపై అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. అంతర్రాష్ట్ర సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుంటూ ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. **ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు సిద్ధం** బ్యారేజీ నిర్మాణం వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. ఇందుకోసం అవసరమైన నిధులను ఇరు రాష్ట్రాల ఉమ్మడి ఖాతాలో జమ చేసేందుకు కూడా సిద్ధమని తెలిపారు. ముంపునకు సంబంధించిన భూములపై మహారాష్ట్ర ప్రభుత్వం స్వయంగా సర్వే నిర్వహించినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు.

అంతర్రాష్ట్ర సమన్వయానికి ప్రాధాన్యం

తుమ్మిడిహెట్టి బ్యారేజీ విషయంలో మహారాష్ట్రతో సమన్వయం ఎంతో ముఖ్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆ రాష్ట్ర అధికారులు కోరిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని, గతంలో చేసుకున్న ఒప్పందాలు, ఇతర సాంకేతిక అంశాలకు సంబంధించిన పత్రాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. చర్చల్లో పురోగతి సాధించేలా నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టతతో ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో తెలంగాణ నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్, ఈఎన్‌సీ రమేష్‌బాబు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డబ్బులు జమయ్యాకే చెక్కుల పంపిణీ

● ఖేలో ఇండియా క్రీడాకారులకు ఇబ్బందులు పెట్టొద్దు.. అధికారుల సమన్వయ లోపంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్,నవంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్): ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షలో క్రీడాశాఖ అధికారుల తీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖలో బాధ్యతారాహిత్యం, అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. **నిధుల బదిలీ తర్వాతే చెక్కులు**



ఆర్థిక శాఖ నుంచి స్పోర్ట్స్ అథారిటీకి నిధులు బదిలీ అయిన తర్వాతే క్రీడాకారులకు చెక్కులు పంపిణీ చేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఖాతాల్లో డబ్బులు లేకుండానే చెక్కులు ఇచ్చి క్రీడాకారులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని సూచించారు. నిధుల లభ్యతను నిర్ధారించుకున్న తర్వాతే చెక్కుల పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. **క్రీడాకారులను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు** క్రీడాకారులు, వారి తల్లిదండ్రులను పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పడం మంచి పద్ధతి కాదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. క్రీడాకారులకు అందాల్సిన ప్రోత్సాహకాలు, ఆర్థిక సహాయం సకాలంలో అందేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచుకుని సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఏపీలో కూటమికే పట్టం!

(మొదటి పేజీ తరువాయి)

ఆధిక్యంలో కొనసాగారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, కడప, మచిలీపట్నం తదితర కార్పొరేషన్లలో కూటమి అభ్యర్థులు ముందంజలో నిలిచారు. విశాఖపట్నం మేయర్ అభ్యర్థిగా టీడీపీ తరఫున బరిలో ఉన్న ముక్కా శ్రావణి ఆధిక్యం సాధించారు. గుంటూరు, తిరుపతి, చిత్తూరు, మచిలీపట్నం కార్పొరేషన్లలోనూ టీడీపీ అభ్యర్థులు విజయం సాధించినట్లు ఫలితాలు వెల్లడయ్యాయి. **పులివెందులలో టీడీపీకి ఆధిక్యం** మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందుల మున్సిపాలిటీలో టీడీపీ కూటమి ఆధిక్యం సాధించడం ఎన్నికల ఫలితాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కడప జిల్లాలోని పలు పట్టణ స్థానిక సంస్థల్లోనూ కూటమి అభ్యర్థులు విజయాలు నమోదు చేశారు. అయితే నంద్యాల జిల్లా నందికొట్కూరు మున్సిపాలిటీలో వైసీపీ విజయం సాధించింది. కొన్ని ప్రాంతాల్లో స్వతంత్ర అభ్యర్థులు కూడా గెలుపొందారు. **మున్సిపాలిటీల్లోనూ కూటమి హవా** రాష్ట్రంలోని 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో జరిగిన ఎన్నికల లెక్కింపులోనూ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు ఆధిక్యం ప్రదర్శించారు. టీడీపీ అత్యధిక స్థానాల్లో గెలుపొందగా, జనసేన, బీజేపీ అభ్యర్థులు కూడా పలు పట్టణాల్లో విజయాలు సాధించారు. వైసీపీ కొన్ని ప్రాంతాల్లో మాత్రమే గెలుపొందింది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలోని పులివెందుల, ప్రొద్దుటూరు, పుంగనూరు వంటి పట్టణాల్లో కూటమి అభ్యర్థుల విజయాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. **వామపక్షాలకూ కొన్ని స్థానాలు** మరోవైపు వామపక్ష పార్టీలు కూడా కొన్ని ప్రాంతాల్లో తమ ఉనికిని చాటుకున్నాయి. గత ఎన్నికల్లో విశాఖపట్నం, విజయవాడ కార్పొరేషన్లలో గెలుచుకున్న ఒక్కో కార్పొరేటర్ స్థానాన్ని సీపీఐ(ఎం) నిలబెట్టుకుంది. మరికొన్ని మున్సిపాలిటీల్లో వార్డు సభ్యుల స్థానాలను సాధించింది. మొత్తంగా పట్టణ ప్రాంతాల్లో జరిగిన ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తించాయి. అధికార కూటమి, ప్రధాన ప్రతి పక్ష వైసీపీ మధ్య జరిగిన పోటీలో పలు కీలక ప్రాంతా ల్లో కూటమి ఆధిక్యం సాధించింది. మిగిలిన స్థానాల లెక్కింపు, తుది ఫలితాలతో పూర్తి రాజకీయ చిత్రం స్పష్టమైంది.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

హైదరాబాద్,నవంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్రంలో గుడిసెలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని బీసీ సంక్షేమ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నాంపల్లిలోని గృహకల్ప కార్యాలయంలో గోషామహల్, చాంద్రాయణగుట్ట, ఎల్బీనగర్, ముషీరాబాద్ నియోజకవర్గాల లబ్ధిదారుల ఎంపికకు కంప్యూటరైజ్డ్ ఈ-లాటరీ నిర్వహించారు. ఎంపికైన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. **నియోజకవర్గానికి 5,500 ఇళ్లు** ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు విడతల్లో కలిపి 5,500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. తొలి విడతలో 3,500, రెండో విడతలో 2,000 ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. మొదటి విడత పనులు చాలావరకు పూర్తయ్యాయని, నిర్మాణ పనుల పురోగతిని బట్టి దశలవారీగా బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. సొంత స్థలం ఉన్నవారికి ప్రాధాన్యత తనిస్తూ ఎల్-1 కేటగిరీలో సుమారు 2 వేల మందికి త్వరలో ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. **ఉపాధికి దగ్గరగా నివాసాలు** హైదరాబాద్‌లో స్థలాల కొరత ఉన్నప్పటికీ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు విలువైన ప్రభుత్వ భూములను వినియోగిస్తున్నామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ, పోలీసు శాఖలకు చెందిన భూములోనూ ఇందిరమ్మ ఇండ్ల టవర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణానికి అనువైన భూములను సేకరిస్తున్నామని, వచ్చే బోనాల నాటికి లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసేలా పనులు వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు.

పాత ఓటర్లకు ఈసీ ఊరట

- జాబితాలో పేరు లేకున్నా ఫారం-6తో మళ్లీ నమోదు చేసుకోవచ్చు

హైదరాబాద్,నవంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్): ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు గల్లంతైన పాత ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం ఊరటనిచ్చింది. గతంలో ఓటరుగా నమోదై ఉండి, ప్రస్తుతం జాబితాలో పేరు కనిపించని వారు తిరిగి ఓటు హక్కు కోసం ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

గతంలో ఓటరుగా ఉన్నప్పటికీ మళ్లీ దరఖాస్తు చేయడం తప్పుడు ప్రకటన కిందకు రాదని తెలిపింది. ఫారం-6లోని 'మొదటిసారి ఓటు నమోదు' అనే ప్రకటనపై పాత ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ కారణంతో వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 31 కింద చర్యలు తీసుకోవద్దని ఎన్నికల నమోదు అధికారులకు సూచించింది. అయితే దరఖాస్తుదారులు



మరో పార్లమెంటరీ లేదా అసెంబ్లీ నియోజకవర్గంలో ఇప్పటికే ఓటరుగా నమోదై ఉండకూడదని స్పష్టం చేసింది. ఢిల్లీ హైకోర్టులో ఈ అంశంపై జరిగిన విచారణ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ సూచనలను అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులకు పంపించింది. స్థానిక భాషల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించింది. దీంతో ముసాయిదా జాబితాలో పేర్లు లేని అర్హులైన పాత ఓటర్లు తిరిగి నమోదు చేసుకునేందుకు అవకాశం కలిగింది.

ప్రకృతి తెచ్చిన కరువు కాదు.. పాలకులు సృష్టించిన కరువు!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని మండిపడ్డారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, పాలకులు తెచ్చిన కరువని వ్యాఖ్యానించారు.తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి మల్లావర్ఖుల సదాశివుడు స్మారక పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ పలువురు సాహితీవేత్తలను సత్కరించి పురస్కారాలు అందజేశారు. 2024-25 సంవత్సరానికి చెమన్‌సింగ్, 2025-26 సంవత్సరానికి సంగిశెట్టి శ్రీనివాస్‌కు స్మారక పురస్కారాలు ప్రదానం చేశారు. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో సేవలందించిన తిరునగరి దేవకిదేవి, కవ్వంపల్లి స్వామిని సన్మానించారు. కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణకు ఈ ఏడాది ఏడున్నర నెలల్లో గోదావరి నది ద్వారా 750 టీఎంసీలు, కృష్ణా నది ద్వారా 258 టీఎంసీల నీరు వచ్చిందని తెలిపారు. మొత్తం వెయ్యి టీఎంసీలకు పైగా నీరు అందుబాటులోకి వచ్చినప్పటికీ, వాటిని సమర్థంగా వినియోగించుకోలేకపోవడం బాధాకరమన్నారు. వందల టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిపోతున్నా రాష్ట్రంలోని రైతులకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కేసీఆర్‌పై అక్కసుతోనే గత ప్రభుత్వం నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులను పక్కనపెట్టడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. గోదావరి జలాలను తెలంగాణ పొలాలకు మళ్లించి రైతులకు సాగునీరు అందించడమే కవి మల్లావర్ఖుల సదాశివుడికి అందించే నిజమైన నివాళి అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోలేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు చివరి రోజు వరకు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ నెల 25న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. అదే రోజు నుంచి డిసెంబర్ 10 వరకు ఓటరు నమోదు దరఖాస్తులపై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరిస్తామని వెల్లడించారు.

శాసనమండలి ప్రాంగణం అభివృద్ధికి కార్యాచరణ

హైదరాబాద్,నవంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్ర శాసనమండలి ప్రాంగణంలో చేపట్టనున్న అభివృద్ధి, సుందరీకరణ పనుల ప్రతిపాదనలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పరిశీలించారు. మంగళవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాతో కలిసి ప్రాంగణాన్ని సందర్శించి ప్రతిపాదిత పనులపై అధికారులతో సమీక్షించారు.శాసనసభ స్పీకర్, మండలి చైర్మన్, వైస్ చైర్మన్, డిప్యూటీ స్పీకర్లతోపాటు ఉభయ సభల కార్యదర్శుల నివాస భవనాల నిర్మాణ ప్రతిపాదనలపై వివరాలు తెలుసుకున్నారు. అనుబంధ భవనం, పరిపాలనా భవనం, శాసనసభా పక్ష కార్యాలయాలు, విశ్రాంతి భవనం, క్రీడా మైదానం, పార్కింగ్ సౌకర్యాల అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు. **పచ్చదనానికి విఘాతం కలగొద్దు** శాసనసభ ప్రాంగణ విస్తరణ కోసం పర్యాటక శాఖకు చెందిన భూమితోపాటు డీజీపీ కార్యాలయానికి చెందిన కొంత భూమిని బదిలీ చేసే అంశంపై చర్చించారు. అభివృద్ధి పనుల సందర్భంగా పర్యావరణానికి హాని కలగకుండా, ఇప్పటికే ఉన్న పచ్చదనాన్ని పరిరక్షించాలని సంజయ్ జాజు అధికారులకు సూచించారు. పర్యావరణహిత, సుస్థిర అభివృద్ధి విధానాలతో ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు.

కేసీఆర్ పాలనలో తెలంగాణ సంపద దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

తమ ప్రభుత్వం మాత్రం రైతులు పండించిన పంటకు బోనస్ అందించి అండగా నిలిచిందని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే 74 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. **ప్రతి భూమికి భరోసా కల్పిస్తాం** రాష్ట్రంలో అర్హులైన పేదలకు 8 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు అందించామని మంత్రి తెలిపారు. సుమారు 120 ఏళ్ల క్రితం జరిగిన భూసర్వేల కారణంగా ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా భూముల సమగ్ర సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో భూసర్వే నిర్వహించాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. సర్వే అనంతరం మ్యాపులతో కూడిన భూధార్ అందించి భూయజమానులకు భరోసా కల్పిస్తామని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పొంగులేటి పేర్కొన్నారు.

సైబర్ నేర ముఠాలపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్, ఐ4సీ సీఈవో రాజేష్ కుమార్ పాల్గొన్నారు. **నేరం జరగకముందే అడ్డుకోవాలి** సైబర్ నేరాలు వ్యవస్థీకృత పరిశ్రమగా మారాయని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. నేరం జరిగిన తర్వాత డబ్బు తిరిగి రాబట్టడం కంటే, ముందుగానే మోసాలను అడ్డుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. నేరగాళ్లకు బాధితులను చేరుకునే మార్గాలు, ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాలు అందకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. 202425లో దేశవ్యాప్తంగా సైబర్ నేరాల ఫిర్యాదులు 24 శాతం పెరగగా, తెలంగాణలో 3 శాతం తగ్గాయని తెలిపారు. రాష్ట్రంలో సైబర్ మోసాల వల్ల జరిగిన ఆర్థిక నష్టాలు 20 శాతం తగ్గినట్లు వెల్లడించారు.**బహుళ రాష్ట్రాల సమన్వయంతో దర్యాప్తు** సైబర్ నేరగాళ్లు రాష్ట్రాల సరిహద్దులు దాటి ఒకే నెట్‌వర్క్‌గా పనిచేస్తున్నారని శిఖా గోయల్ తెలిపారు. నేరాల సూత్రధారులు, ఆర్థిక సహాయకులను గుర్తించేందుకు కేసుల వారీ దర్యాప్తు విధానానికి బదులుగా నిఘా ఆధారిత సమన్వయ దర్యాప్తు అవసరమని పేర్కొన్నారు. అనుమానాస్పద లావాదేవీలను నిలిపివేసేలా బ్యాంకులకు మార్గదర్శకాలు, ఏకీకృత దర్యాప్తు వేదిక, దేశవ్యాప్త ప్రత్యేక ఆపరేషన్లపై సమావేశంలో చర్చించారు. మహిళలు, చిన్నారులపై ఆన్‌లైన్ నేరాలు, కృత్రిమ మేధ వినియోగం, మ్యూల్ బ్యాంకు ఖాతాల ద్వారా జరిగే మోసాల నియంత్రణపైనా అధికారులు చర్చించారు. సమావేశంలో రూపొందించిన సిఫార్సులను అన్ని రాష్ట్రాలు, సంబంధిత సంస్థలకు పంపించి తదుపరి చర్యలు చేపట్టనున్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా డాక్టర్ పిడమర్తి రవికి అవకాశం కల్పించాలి

ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలి.. టీఎంహెచ్డీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి



ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, మాదిగ సామాజిక వర్గ హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తున్న మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవికి గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్డీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ (దళితరత్న) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో కనీసం ఒక స్థానాన్ని మాదిగ సామాజిక వర్గానికి కేటాయించి సామాజిక న్యాయం చాటాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం సాగిన ఉద్యమంలో డాక్టర్ పిడమర్తి రవి తనదైన పాత్ర పోషించారని, మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా సమాజ హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ, రిజర్వేషన్ల అమలు కోసం ఆయన చేసిన పోరాటం, ఉద్యమ సేవలను గుర్తించి ఎమ్మెల్సీ పదవికి అవకాశం కల్పించాలని కోరారు.రాజకీయంగా, సామాజికంగా మాదిగలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని, డాక్టర్ పిడమర్తి రవికి ఎమ్మెల్సీ పదవి ఇస్తే మాదిగ సామాజిక వర్గానికి తగిన గుర్తింపు, న్యాయం లభిస్తాయని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించి, ఈసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవుల్లో ఒకదాన్ని మాదిగ నాయకుడైన డాక్టర్ పిడమర్తి రవికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టీఎంహెచ్డీ నాయకులు మునగలేటి వీరస్వామి మాదిగ, బహుజన నాయకులు రాయల శ్రీనివాస్, మంద కుమార్ మాదిగ, రాములు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి విజయదుందుభి.. ఖమ్మంలోనూ టీడీపీ జెండా ఎగరడం ఖాయం!

విజయం సాధించిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపిన ఖమ్మం టీడీపీ నేతలు చుండూరు రాజేశ్వరి, పాలడుగు కృష్ణ ప్రసాద్





ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి సాధించిన ఘనవిజయం ప్రజాబలానికి, నాయకత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని టీడీపీ తెలుగు మహిళ అధికార ప్రతినిధి చుండూరు రాజేశ్వరి, ఖమ్మం జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పాలడుగు కృష్ణ ప్రసాద్ అన్నారు. కూటమి అభ్యర్థులు సాధించిన విజయంతో తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులందరికీ వారు హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ప్రజల ఆశీస్సులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితోనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని అన్నారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేయాలని విజయం సాధించిన అభ్యర్థులకు సూచించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. మహిళల అభ్యున్నతి, యువతకు ఉపాధి, రైతుల సంక్షేమానికి మరింత ప్రాధాన్యత కల్పించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుమతితో రాబోయే ఖమ్మం నగరపాలక సంస్థ ఎన్నికల్లోనూ తెలుగుదేశం పార్టీ విజయదుందుభి మోగించడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం నగరంలో టీడీపీకి బలమైన కేడర్, ప్రజల ఆదరణ ఉందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తే కార్పొరేషన్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించడం తథ్యమని అన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో కూటమి సాధించిన విజయస్ఫూర్తితో ఖమ్మంలోనూ తెలుగుదేశం పార్టీ విజయపతాకాన్ని ఎగురవేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు మరింత చేరువవుతామని చుండూరు రాజేశ్వరి, పాలడుగు కృష్ణ ప్రసాద్ స్పష్టం చేశారు.

డంపింగ్ యార్డు శాశ్వత ఎత్తివేతకు అఖిలపక్ష కార్యాచరణకు జేఏసీ స్వాగతం



- 109 రోజుల ప్రణాళికను నిర్ణీత గడువులో అమలు చేయాలి

జవహర్ నగర్ నవంబర్ 3 (పి సీ డబ్ల్యూ న్యూస్): నాగారంలోని ఎంవైఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో తోటకూర వజ్రేష్ యాదవ్ సమక్షంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశాన్ని, అందులో ప్రకటించిన కార్యాచరణ ప్రణాళికను జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ (జేఏసీ) స్వాగతించింది. ఈ మేరకు కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అఖిలపక్షం ప్రకటించిన కార్యాచరణపై వారం రోజుల తర్వాత నిర్వహించే జేఏసీ సమావేశంలో తమ తదుపరి నిర్ణయాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు. 109 రోజుల ప్రణాళికను 30 రోజుల్లోనే ముందుకు తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. 27 ఏళ్లుగా పరిష్కారం కాని ఈ సమస్యపై అధికార పార్టీ చొరవ తీసుకుని అఖిలపక్ష సమావేశం నిర్వహించడం స్వాగతించదగిన పరిణామమని వారు అన్నారు. ఈ సమస్యను రాజకీయ కోణంలో కాకుండా, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య, ఆర్థిక, శారీరక, మానసిక ఇబ్బందుల దృష్ట్యా పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా 12 డిమాండ్లతో కూడిన తమ వైఖరి పత్రాన్ని అఖిలపక్షానికి అందజేసినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రాణాలు, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ వాటిని పరిశీలించాలని విజ్ఞప్తి చేసినట్లు వివరించారు.డంపింగ్ యార్డును ఆధునీకరణ పేరుతో అదే ప్రాంతంలో కొనసాగించకుండా శాశ్వతంగా ఎత్తివేస్తామని అసెంబ్లీలో ప్రకటించి, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓ) విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అక్కడ పేరుకుపోయిన లక్షల టన్నుల పాత చెత్తను (లెగసీ వేస్ట్) 12 నెలల్లో బయోమైనింగ్ ద్వారా తొలగించి, ఆ స్థలాన్ని బయోడైవర్సిటీ పార్కుగా అభివృద్ధి చేయాలని కోరారు.డంపింగ్ యార్డుకు 15 కిలోమీటర్ల పరిధిలో నివసించే ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించడంతోపాటు, రూ.20 లక్షల ఉచిత ఆరోగ్య బీమా కల్పించాలని సూచించారు. బాధిత ప్రాంతాల ప్రజలకు ఆస్తిపన్ను మినహాయింపు ఇవ్వాలని, రహదారులు, డ్రైనేజీ, మంచినీటి సదుపాయాలు, మోడల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే, సుమారు 3,000 మంది వేస్ట్ వారియర్స్‌కు జీహెచ్ఎంసీ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లేదా రూ.50 లక్షల పరిహార ప్యాకేజీ అందించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. 109 రోజుల కార్యాచరణ ప్రణాళిక కేవలం ప్రకటనకే పరిమితం కాకుండా, డంపింగ్ యార్డు శాశ్వత ఎత్తివేతకు దారితీయాలని వారు ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనకు జవహర్ నగర్ జేఏసీ సంపూర్ణ సహకారం అందిస్తుందని షేక్ షావలి, ఉమామహేష్ స్పష్టం చేశారు.అఖిలపక్ష సమావేశం జరిగిన వారం రోజుల్లోగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో శాశ్వత అఖిలపక్ష సాధన కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి నెలా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించి, డంపింగ్ యార్డు తరలింపునకు అవసరమైన చట్టపరమైన చర్యలను ప్రభుత్వం వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో-కన్వీనర్లు టీఆర్ఎస్‌కు చెందిన మేక లలిత యాదవ్, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్‌కు చెందిన గడ్డం సదానందం, సీపీఐకి చెందిన దర్శనం యాదగిరి, సీపీఎంకు చెందిన శివన్నారాయణ, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన మహ్మద్ పాషామియా, బహుజన రక్షణ సమితికి చెందిన మహ్మద్ జావేద్, టీయూసీఐకి చెందిన వి.ప్రవీణ్, పీఓడబ్ల్యూ (విముక్తి)కి చెందిన గడిపే సునీత, ఏఐటీయూసీకి చెందిన అంబాల ఎల్లయ్య, సీఐటీయూకు చెందిన నర్సింహులు, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీలో సీనియర్ జర్నలిస్ట్ సావల్కర్‌కు ఘన సన్మానం

- **మాహులీ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరో 32 మందికి పురస్కారాలు**





హైదరాబాద్, నవంబర్ 03 (పీసీడబ్ల్యూ న్యూస్):నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ సావల్కర్ శ్రీధర్‌రావుకు షిర్డీలో ఘన సన్మానం లభించింది. మాహులీ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టుగా ఎంపిక చేసి ఆయనకు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కార్యాలయ అధికారిణి మంజూషా కులకర్ణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీధర్‌రావుతో పాటు వివిధ రంగాల్లో సేవలందించిన మరో 32 మందికి అవార్డులు ప్రదానం చేశారు. **1989లో పత్రికారంగంలోకి..** శ్రీధర్‌రావు 1989లో నిజామాబాద్ కేంద్రంగా వెలువడిన 'పొద్దు' దినపత్రికతో జర్నలిజం ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, వార్త, కబురు, నమస్తే తెలంగాణ, హైదరాబాద్ మిర్రర్ తదితర పత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. 2014లో హైదరాబాద్‌కు చేరుకున్న ఆయన 'మెట్రో ఈవినింగ్స్' దినపత్రికలో సీనియర్ జర్నలిస్టుగా సేవలందించారు.**గతంలోనూ పలు పురస్కారాలు** 1997లో నిజామాబాద్ జిల్లా భగత్‌సింగ్ యువజన సంఘం ఆయనను ఉత్తమ పరిశోధనాత్మక జర్నలిస్టుగా ఎంపిక చేసి సత్కరించింది. జన్మభూమి కార్యక్రమంలోనూ మండల స్థాయిలో ఉత్తమ విలేఖరిగా అవార్డు అందుకున్నారు. లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, పీఆర్‌టీయూ తదితర సంస్థల నుంచి కూడా పలు సన్మానాలు పొందారు. షిర్డీలో తనను గుర్తించి గౌరవించిన ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్ మూలే, కార్యనిర్వాహక అధ్యక్షురాలు సరళా శేష్ తదితరులకు శ్రీధర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

భాభా ఆశయాలకు అనుగుణంగా పరిశోధనా సంస్థలు నిర్మించాలి

- **డిగ్రీలకే పరిమితం కాకుండా శాస్త్రీయ అభివృద్ధికి పునాది వేయాలి: మహమ్మద్ అజీమ్**



కరీంనగర్, నవంబర్ 3 (పీసీడబ్ల్యూ న్యూస్):కేవలం డిగ్రీలు, పట్టభద్రులను తయారు చేయడమే విద్య లక్ష్యం కాకూడదని, దేశ శాస్త్రీయ భవిష్యత్తుకు పునాది వేసే పరిశోధనా సంస్థలను నిర్మించాలని మహమ్మద్ అజీమ్ అన్నారు. హోమీ జహంగీర్ భాభా చూపిన మార్గంలో పరిశోధన రంగాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు.క్యాన్సర్ పరిశోధన, న్యూక్లియర్ మెడిసిన్, మెడికల్ ఫిజిక్స్, రేడియేషన్ సేఫ్టీ వంటి రంగాల్లో యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాలన్నారు. ఆధునిక ప్రయోగశాలలు, పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతిభావంతులకు ప్రోత్సాహం అందించాలని పేర్కొన్నారు.హైదరాబాద్‌కే పరిశోధన అవకాశాలు పరిమితం కాకుండా కరీంనగర్ వంటి చిన్న పట్టణాల్లోనూ విజ్ఞాన, సాంకేతిక కేంద్రాలను అభివృద్ధి చేయాలని కోరారు. విదేశాలకు వెళ్లిన భారతీయ నిపుణుల విజ్ఞానాన్ని దేశాభివృద్ధికి వినియోగించుకునేలా వసతులు కల్పించాలన్నారు.డిగ్రీలు సంపాదించడమే కాకుండా నూతన ఆవిష్కరణలు చేసే పరిశోధకులను తయారు చేయడం, కీలక రంగాల్లో స్వయం సమృద్ధి సాధించడం ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమని మహమ్మద్ అజీమ్ పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ ఆరోపణలను ఖండించిన బీజేపీ కార్పొరేటర్లు

- **బండి సంజయ్, పాలకవర్గంపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించం: బండారి వేణు, సోమిడి వేణు**



కరీంనగర్, నవంబర్ 3 (పీసీడబ్ల్యూ న్యూస్): బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ చేసిన ఆరోపణలను బీజేపీ కార్పొరేటర్లు బండారి వేణు, సోమిడి వేణు ఖండించారు. కరీంనగర్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ పార్టీ అంతర్గత సమావేశంలో పాలకవర్గానికి చేసిన సూచనలను వక్రీకరించి తమపై అవినీతి ఆరోపణలు చేయడం సరికాదన్నారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొందరు కార్పొరేటర్లు అవినీతి, భూకబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ నగర అభివృద్ధికి కృషి చేయాలనే ఉద్దేశంతోనే బండి సంజయ్ తమకు దిశానిర్దేశం చేస్తున్నారని తెలిపారు. తమ నాయకులు, పాలకవర్గంపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదాలత్ మస్జిద్ భూమి జోలికొస్తే మరో ఉద్యమం తప్పదు!

●రవీందర్‌సింగ్ వ్యాఖ్యలు గంగుల చిలుక పలుకులే.. ముస్లింల మనోభావాలు దెబ్బతీయొద్దు ●ఎంఐఎం యువజన నాయకుడు మెరాజొద్దీన్ హెచ్చరిక



కరీంనగర్, నవంబర్ 03 (పీసీడబ్ల్యూ న్యూస్):అదాలత్ మస్జిద్ వక్ఫ్ భూమి విషయంలో మాజీ మేయర్, బీఆర్ఎస్ కార్పొరేటర్ రవీందర్‌సింగ్ చేసిన వ్యాఖ్యలను ఎంఐఎం యువజన నాయకుడు మహమ్మద్ మెరాజొద్దీన్ తీవ్రంగా ఖండించారు. రవీందర్‌సింగ్ మాట్లాడుతున్న మాటలు ఆయన సొంతం కాదని, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చెప్పిన చిలుక పలుకులని విమర్శించారు. ముస్లిం సమాజం బీఆర్ఎస్‌కు ముగ్గురు కార్పొరేటర్లను గెలిపించి అండగా నిలిస్తే, అదే పార్టీకి చెందిన నాయకులు మస్జిద్ భూమి అంశాన్ని తెరపైకి తెచ్చి ముస్లింల మనోభావాలను దెబ్బతీయడం ఏమిటని ప్రశ్నించారు.ప్రజల పన్నులతో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అదాలత్ మస్జిద్ భూమిని కొనుగోలు చేసిందంటూ రవీందర్‌సింగ్ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఆయన ఐదేళ్లు మేయర్‌గా పనిచేసిన సమయంలో ఈ విషయం ఎందుకు ప్రస్తావించలేదని నిలదీశారు. గెజిట్ ప్రకారం మార్కెట్‌కు సంబంధించిన రెండు ఎకరాలకు పైగా భూమి వక్ఫ్ బోర్డుకు చెందినదని పేర్కొన్నారు. ఈ అంశంపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా, ఇప్పుడు హఠాత్తుగా ఎందుకు ప్రస్తావిస్తున్నారని ప్రశ్నించారు.రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ లబ్ధి కోసం ఈ అంశాన్ని తెరపైకి తెస్తున్నారని మెరాజొద్దీన్ ఆరోపించారు. కరీంనగర్‌లో బీజేపీని బలోపేతం చేసేందుకు గంగుల కమలాకర్, రవీందర్‌సింగ్ కలిసి రాజకీయ నాటకానికి తెరతీశారని విమర్శించారు. గతంలో మేయర్‌గా, కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన రవీందర్‌సింగ్‌కు ఈ భూమి విషయం ఇప్పుడే గుర్తుకు రావడం వెనుక కారణమేంటని ప్రశ్నించారు.ఎమ్మెల్యే గంగుల వక్ఫ్ భూమి విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఇప్పుడు అదాలత్ మస్జిద్ భూమిపై రవీందర్‌సింగ్ కన్ను పడిందా అని మెరాజొద్దీన్ ప్రశ్నించారు. మస్జిద్ భూమి జోలికొస్తే సహించేది లేదని, కరీంనగర్ ముస్లిం సమాజాన్ని ఏకం చేసి మరో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ముస్లింల మనోభావాలను గౌరవించాలని, లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు.

కళ్యాణలక్ష్మితో ఆర్థిక భరోసా:ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



గంగాధర నవంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు రూ. 30 లక్షల 28 వేల 509 రూపాయల విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేద,మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఆడ పిల్లల పెళ్లికి కల్యాణ లక్ష్మి పథకం ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద రూ. 30 లక్షల 28 వేల 509 రూపాయలు ఆర్థిక సహాయం మంజూరు అయింది. మంగళవారం గంగాధర మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, గృహ జ్యోతి పథకంతో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, తాసిల్దార్ అంబటి రజిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దుబ్బాసి బుచ్చయ్య,మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ,మాజీ జెడ్పిటిసి గునుకొండ బాబు,సత్తు కనకయ్య, సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షుడు ముద్దం నగేష్,సర్పంచ్ లు పడాల భాగ్యలక్ష్మి రాజన్న,వేముల భాస్కర్,రామిడి రాజిరెడ్డి,రేండ్ల శ్రీనివాస్,బీర్ల ఆనంద్,ఆరె తేజశ్రీ – రాజశేఖర్,మల్కాపురం రాజేశ్వరి రాజేశం,కడారి రేణుక కనకయ్య,ఈటవేని శ్రీనివాస్,కోలేపాక కవిత మల్లేశం,ధీకొండ బాబలక్ష్మి మధు,దానే అనసూర్య ఓదెలు,గుండవేని లావణ్య తిరుపతి,ఎట్టెపు కనకయ్య,గంకిడి సంధ్య చంద్ర రెడ్డి,కాంగ్రెస్ నాయకులు సాగి అజయ్ రావు,రోమల రమేష్ ,కర్ర బాపు రెడ్డి,రాచమల్ల భాస్కర్,దోర్నాల శ్రీనివాస్ రెడ్డి,బురుగు గంగన్న,అత్తపురం తిరుపతి, గంగాధర ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ పట్టణ గ్రంథాలయాన్ని సందర్శించిన శేఖర్ సేనాపతి

- విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి: శేఖర్ సేనాపతి



రాజన్న సిరిసిల్ల జిల్లా, నవంబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్): యువచైతన్య దీపం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శేఖర్ సేనాపతి వేములవాడ పట్టణ గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల ప్రాముఖ్యతను, విద్యార్థుల జీవితాల్లో పుస్తక పఠనం పోషించే పాత్రను వివరించారు.ఈ సందర్భంగా శేఖర్ సేనాపతి మాట్లాడుతూ.. గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు చదివే ప్రదేశాలు మాత్రమే కాకుండా, విద్యార్థుల జీవితాలకు వెలుగునిచ్చే జ్ఞాన భాండాగారాలని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికి గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటూ పుస్తక పఠనాన్ని తమ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. పుస్తకాలు జ్ఞానాన్ని అందించడమే కాకుండా, జీవితంలో సరైన మార్గంలో ముందుకు సాగేందుకు ప్రేరణనిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి చేతిలో పుస్తకం ఉంటే వారి భవిష్యత్తుకు విజయపథం ఏర్పడుతుందని పేర్కొన్నారు.గ్రంథాలయాల అభివృద్ధికి, విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.పుస్తకం మంచి నేస్తం.. గ్రంథాలయం బంగారు భవిష్యత్తుకు బాట అనే సందేశంతో యువచైతన్య దీపం ఫౌండేషన్ (2013) విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు.

కళల్లో ఒకరు.. క్రీడల్లో ఇద్దరూ.. సత్తా చాటిన కవలలు!

- చిత్రలేఖనంలో స్రాగ్వికి ప్రథమ బహుమతి.. వాలీబాల్‌లో విజేతగా పాఠశాల జట్టు



గంగాధర, నవంబర్ 03 (పీసీడబ్ల్యూ న్యూస్):కరీంనగర్ జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో టీజీఎంఎస్ మోడల్ స్కూల్ గంగాధరకు చెందిన విద్యార్థిని రావుల స్రాగ్వి ప్రథమ బహుమతి సాధించింది. అదే విధంగా జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టులో స్రాగ్వితో పాటు ఆమె కవల సోదరి రావుల స్నిగ్ధ సభ్యురాలిగా ఉండటం విశేషం.కవల సోదరీమణులు కళలు, క్రీడల్లో ప్రతిభ చాటుకోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యతో పాటు కళలు, క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు స్రాగ్వి, స్నిగ్ధలను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై జాప్యం తగదు

పేట్ బషీరాబాద్, నిజాంపేట స్థలాలే కేటాయించాలి

ప్రత్యేక జీవో జారీ చేయాలి: టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



హైదరాబాద్, నవంబర్ 03 (పీసీడబ్ల్యూ న్యూస్):18 ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. జేఎన్‌జే సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనకు జర్నలిస్టు సంఘాల నాయకులు, సీనియర్ పాత్రికేయులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం జాప్యం చేయడం తగదన్నారు. గతంలో నిజాంపేటలో సర్వే నంబర్ 332లో 32 ఎకరాలు, పేట్ బషీరాబాద్‌లో సర్వే నంబర్ 25/2లో 38 ఎకరాలు జేఎన్‌జే సొసైటీకి కేటాయించినప్పటికీ, ఆ భూములను సభ్యులకు అందించకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం అన్యాయమని పేర్కొన్నారు.ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు చెల్లించి ఇన్నేళ్లుగా స్థలాల కోసం ఎదురుచూస్తున్న సభ్యులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుమార్లు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా ప్రత్యేక జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు.సొసైటీ సభ్యులు రమణారావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో పేట్ బషీరాబాద్, నిజాంపేటలో గతంలో కేటాయించిన స్థలాలనే తమకు అందించాలని సభ్యులు తీర్మానించారు. సీనియర్ పాత్రికేయులు ఎంవీఆర్ శాస్త్రి, గోపరాజు, మహేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీనివాసరావు, బొల్లం శ్రీనివాస్, కుంచం శ్రీనివాస్, వి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యమే మహిళా సాధికారతకు సోపానం

- యువతకు ఉపాధి.. మహిళలకు ఆర్థిక భరోసా అభినందనీయం

- రాజ్యాంగ పరిరక్షణ వేదిక (ఆర్‌పీవీ) వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్) : మహిళలు తమలోని ప్రతిభను వెలికితీసుకొని అన్ని రంగాల్లో రాణించాలంటే నైపుణ్య శిక్షణ ఎంతో అవసరమని, ఈ నైపుణ్యమే మహిళా సాధికారతకు సోపానమని రాజ్యాంగ పరిరక్షణ వేదిక (ఆర్‌పీవీ) వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ అన్నారు. మహిళలకు వృత్తి నైపుణ్యాలు నేర్పించి, స్వయం ఉపాధి అవకాశాల ద్వారా వారి జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపాలనే లక్ష్యంతో చేపడుతున్న కార్యక్రమాలు సమాజ అభివృద్ధికి బాటలు వేస్తాయని అన్నారు.మహిళల్లో నైపుణ్యాన్ని పెంపొందించి, వారిని స్వయం ఉపాధి దిశగా నడిపించాలనే ఉద్దేశంతో మంగళవారం ఏర్పాటుచేసిన 'నారీ నైపుణ్యం స్కిల్ సెంటర్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తూ, ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తున్న కె.సి పుల్లయ్య ఫౌండేషన్ చైర్మన్ అనిల్ కుమార్ కామిశెట్టి, సీఈఓ సుధారాణిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సయ్యద్ సాదిక్ అలీ మాట్లాడుతూ.. విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమం, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ వంటి విభిన్న రంగాల్లో కె.సి పుల్లయ్య ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగాలకు అవసరమైన సామర్థ్యాలను పెంపొందించడం, మహిళలకు ఉపాధి నైపుణ్యాలు నేర్పించి స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించడం ద్వారా ఫౌండేషన్ సామాజిక అభివృద్ధిలో భాగస్వామిగా నిలుస్తోందని పేర్కొన్నారు.నేటి సమాజంలో మహిళలు కుటుంబ బాధ్యతలకే పరిమితం కాకుండా తమ కాళ్లపై తాము నిలబడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సరైన శిక్షణ, ప్రోత్సాహం, అవకాశాలు లభిస్తే మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధించగలరని అన్నారు. నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ఆర్థికంగా స్వతంత్రులుగా ఎదిగి కుటుంబానికి, సమాజానికి అండగా నిలవాలని మహిళలకు పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఒకవైపు, మహిళలకు స్వయం ఉపాధి మార్గాలను చూపించడం మరోవైపు సాగినప్పుడే సమాజం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళలకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించి, ఉపాధి పొందేలా చేయడం, సొంతంగా ఆదాయం సంపాదించుకునే సామర్థ్యాన్ని పెంపొందించడమే 'నారీ నైపుణ్యం స్కిల్ సెంటర్' ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. 'ది గాడ్ థెరిస్సా మహిళా మండలి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు ఎ. నాగరాణి, కార్యదర్శి ఉమ, కోశాధికారి ఖతీజా బేగం, ఏ. సుందర్ రావు, జి.వి. మాల్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ గుర్రం ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గుడుంబా తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

- 50 లీటర్ల గుడుంబా, 2 వేల లీటర్ల పానకం స్వాధీనం

ఏటూరునాగారం, నవంబర్ 3 (పీసీడబ్ల్యూ న్యూస్):అక్రమ గుడుంబా తయారీ, నిల్వలపై పోలీసులు దాడి చేసి 50 లీటర్ల గుడుంబా, 2 వేల లీటర్ల పానకాన్ని స్వాధీనం చేసుకున్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలానికి చెందిన గాడిచెర్ల నారాయణ (58)కు సంబంధించిన నిల్వలను గుర్తించి ఈ దాడి చేపట్టారు.అక్రమ మద్యం తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ దాడిలో ఎస్ఐ మహేష్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, కానిస్టేబుళ్లు సుధాకర్, చంద్రమోహన్ పాల్గొన్నారు.



అవినీతికి కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్సే..

బీజేపీ పాలకవర్గంపై బురదజల్లితే ఊరుకోం!

బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ వ్యాఖ్యలపై విరుచుకుపడ్డ కార్పొరేటర్లు బండారి వేణు, సోమిడి వేణు



కరీంనగర్ నవంబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్): గత బీఆర్ఎస్ పాలన అంతా అవినీతి, అక్రమాలు, భూకబ్జాల మయమని... ఎలాంటి ఆధారాలు లేకుండా బీజేపీ పాలకవర్గానికి అవినీతి మచ్చ పూయాలని చూస్తే చూస్తూ ఊరుకునేది లేదని బీజేపీ కార్పొరేటర్లు బండారి వేణు, సోమిడి వేణు ప్రసాద్ తీవ్రంగా హెచ్చరించారు. కరీంనగర్‌లోని ఎస్బీఎస్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు.కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నగర అభివృద్ధి, ప్రజలకు పారదర్శకమైన సుపరిపాలన అందించడమే లక్ష్యంగా తమ పాలకవర్గానికి దిశానిర్దేశం చేస్తారన్నారు. పార్టీ అంతర్గత సమావేశాల్లో "అవినీతికి ఏమాత్రం ఆస్కారం ఇవ్వొద్దు" అని హెచ్చరిస్తూ చేసిన సాధారణ సూచనలను వక్రీకరించి చౌకబారు ఆరోపణలు చేయడం బీఆర్ఎస్ నేతల దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొందరు కార్పొరేటర్లు అవినీతి, భూకబ్జాలు, దందాలకు పాల్పడి ప్రజలను భయాందోళనలకు గురిచేసిన చరిత్రను మరిచిపోయారా అని ప్రశ్నించారు. డబ్బుల కోసం కంపౌండ్ గోడలను, నివాస గృహాలను కూల్చే బుల్డోజర్ సంస్కృతిని పెంచి పోషించింది బీఆర్ఎస్ నాయకులు కాదా అని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతికి పాల్పడి జైలుకెళ్లిన నేతలను జైల్లో కలిసొచ్చి పరామర్శించడం, వారికి లీగల్ అడ్వైజరీ కమిటీలు నియమించి, లక్షల రూపాయల డబ్బులిచ్చి విదేశాలకు పంపిన నీచ చరిత్ర బీఆర్ఎస్ నాయకుడిదని ధ్వజమెత్తారు. గతంలో నగరపాలక సంస్థ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పేరుతో అవినీతికి పాల్పడి నగరపాలక సంస్థను దోచుకుంది చల్ల హరిశంకర్ కాదా అని నిలదీశారు. అలాగే బీఆర్ఎస్ నేత రవీందర్ సింగ్ వ్యవహారమంతా నగర ప్రజానీకానికి తెలుసని , లోగడ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా , మున్సిపల్ షెటర్ విషయంలో ఆయన వ్యవహరించిన తీరు మరిచిపోయి మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో ప్రజలు బీఆర్ఎస్‌ను సింగిల్ డిజిట్‌కే పరిమితం చేసినా వారికి ఇంకా బుద్ధి రాలేదని ఎద్దేవా చేశారు. నిజాయితీగా, పారదర్శకంగా పనిచేస్తున్న బీజేపీ పాలకవర్గంపై అనవసరంగా బురదజల్లితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు తాటి ప్రభావతి, దేశ శిల్ప వేదం, పెద్దపల్లి శ్రీలేఖ జితేందర్, బండ రమణ రెడ్డి ప్రకాష్, వంగల పవన్, మేకల వెంకటేష్, భూపతి రవీందర్, కేఏపీపీ చంద్ర, కన్న కృష్ణ, కర్రె పద్మ అనిల్, కొంపల్లి రమణ, తోట అనిల్, మాసం గణేష్, సత్యం, గొట్టముక్కల రమణ, గాజా శివరాం, ముజీబ్, నందు పాల్గొన్నారు.

కరీంనగర్ ఊర చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో అక్రమ గోడౌన్ కూల్చివేయాలి

● కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు బిజెపి నేతల ఫిర్యాదు



కరీంనగర్ నవంబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ నగర పాలక సంస్థ 17వ డివిజన్ పరిధిలోని ఊర చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన గోడౌన్‌ను వెంటనే కూల్చివేసి చెరువును పరిరక్షించాలని బిజెపి మాజీ పట్టణ అధ్యక్షుడు కేంచ శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం రోజున కరీంనగర్ కలెక్టరేట్‌తో పాటు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో కేంచ శేఖర్ , బిజెపి నాయకులతో కలసి కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్గం శ్రీనివాస్, సర్గం మల్లేశం, సర్గం రాజు అనే వ్యక్తులు మున్సిపల్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా, కొత్తపల్లి పరిధిలోని ఊర చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా గోడౌన్ నిర్మాణం చేపట్టారని తెలిపారు. గతంలో ఇరిగేషన్ అధికారుల సూచనల మేరకు మున్సిపల్ అధికారులు ఈ నిర్మాణంపై నోటీసులు ఇచ్చి, కేటాయించిన ఇంటి నంబర్‌ను కూడా రద్దు చేశారని గుర్తుచేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు గోడౌన్‌ను పూర్తిగా తొలగించలేదని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై కలెక్టర్, కమిషనర్ సానుకూలంగా స్పందించారని, ఆర్‌డీవో, ఇరిగేషన్ మున్సిపల్ అధికారులతో సమీక్షించి తక్షణమే ఆ అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తామని హామీ ఇచ్చారని కేంచ శేఖర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ముత్తునూరి హరీష్, జేరిపోతుల శ్రీకాంత్, దుబాయ్ సునీల్, ఎస్. రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేన గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా సోను భాయ్ (రాకేష్ గైక్లాడ్) నియామకం!

గ్రేటర్ హైదరాబాద్‌లో పార్టీ బలోపేతమే లక్ష్యం.. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పార్టీ జెండా ఎగురవేస్తాం: రాకేష్ గైక్లాడ్





హైదరాబాద్, నవంబర్ 03 (పీసీడబ్ల్యూ న్యూస్): తెలంగాణ రాష్ట్ర రక్షణ సేన గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా రాకేష్ గైక్లాడ్ (సోనూ భాయ్) నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. తన జన్మదినం సందర్భంగా పార్టీ కీలక బాధ్యతలు అప్పగించిన కల్వకుంట్ల కవితకు రాకేష్ గైక్లాడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తెలంగాణ రక్షణ సేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. రానున్న గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో జీహెచ్ఎంసీ పై తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండాను ఎగురవేయడమే తమ లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు. యువత రాజకీయాల్లోకి వచ్చి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలకు బీసీ అభ్యర్థులను ప్రకటించడం తెలంగాణ రక్షణ సేన పార్టీ సామాజిక న్యాయానికి ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని అన్నారు. కల్వకుంట్ల కవిత నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత, అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.తన జన్మదినం సందర్భంగా పార్టీ కార్యాలయంలో కల్వకుంట్ల కవిత ఆశీర్వాదాలు తీసుకోవడం, అదే రోజున గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా నియామక బాధ్యతలు స్వీకరించడం ఎంతో ఆనందంగా ఉందని రాకేష్ గైక్లాడ్ తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని వెల్లడించారు.మౌనిక నరేష్, సయ్యద్ అబూబకర్ బిన్ జాఫర్ , సిర్పుల రవికాంత్, నంద్యాల అనిల్ కుమార్, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లంపల్లిని వీడినా.. ప్రజల గుండెల్లో చెరగని స్థానం!

- వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ సహదేవ్ సేవలకు పశుపోషకుల ప్రశంసలు





మల్లంపల్లి, నవంబర్ 3 (పి.సి.డబ్ల్యూ న్యూస్): ప్రభుత్వ ఉద్యోగంలో బదిలీలు సహజం. కానీ పనిచేసిన ప్రాంతంలో ప్రజల మన్ననలు పొందడం మాత్రం అరుదు. ఈ కోవలోనే మల్లంపల్లిలో వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన సహదేవ్ తన సేవలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.విధుల్లో ఉన్న సమయంలో పశుపోషకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పశువుల ఆరోగ్య సమస్యలపై తక్షణమే స్పందించేవారు. పశువులకు వైద్య సేవలు అందించడమే కాకుండా, రైతులకు తగిన సలహాలు, సూచనలు అందిస్తూ వారి నమ్మకాన్ని చూరగొన్నారు.పశువులపైనే ఆధారపడి జీవించే కుటుంబాలకు ఆయన అందించిన సేవలు ఎంతో ఉపయోగపడ్డాయని పశుపోషకులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం బదిలీపై వెళ్లిపోయినప్పటికీ, ఆయన చూపిన సేవాభావం, ఆత్మీయతను మర్చిపోలేకపోతున్నారు.అధికారి అంటే కేవలం విధులు నిర్వహించేవారు మాత్రమే కాదు.. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలకు పరిష్కారం చూపేవారనే దానికి సహదేవ్ పనితీరు నిదర్శనమని స్థానికులు ప్రశంసిస్తున్నారు. మల్లంపల్లిని వీడినా ఆయన అందించిన సేవలు మాత్రం ప్రజల జ్ఞాపకాల్లో నిలిచిపోయాయని పశుపోషకులు అభిప్రాయపడుతున్నారు.

సాగుభూమి సంరక్షణతోనే స్థిరమైన వ్యవసాయం

- కేతి బచావో అభియాన్‌లో పాల్గొన్న మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు







మల్లంపల్లి, నవంబర్ 3 (పి.సి.డబ్ల్యూ న్యూస్): రైతులకు సాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా మల్లంపల్లిలో కేతి బచావో అభియాన్ (సాగుభూమి సంరక్షణ) కార్యక్రమాన్ని నిర్వహించారు.మంగళవారం మల్లంపల్లి గ్రామానికి చెందిన చిట్టిరెడ్డి మల్లారెడ్డి మిరప మల్చింగ్ క్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి ఎద్దడి పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో, నీటి లభ్యతకు అనుగుణంగా తక్కువ నీటితో సాగయ్యే స్వల్పకాలిక ఆరుతడి పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు.ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణజ్యోతి, రాజు, విజయభాస్కర్, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విశ్వతేజలు రైతులకు పలు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, సమీకృత తెగుళ్ల యాజమాన్యం, పంటల మార్పిడి, పంట వ్యర్థాల నిర్వహణ, నీటి పొదుపు, సేంద్రీయ జీవ ఉత్పత్తుల వినియోగం, పశుగ్రాస పంటల సాగు తదితర అంశాలను వివరించారు. ఇఫ్కో కంపెనీ మేనేజర్ విశాల్ షిండే డ్రోన్ ద్వారా నానో ఎరువుల పిచికారీని ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రవీందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీధర్, ఏఈఓ జ్యోతిరాణి, రైతులు గొర్రె కుమార్, రవిబాబు, దేవేందర్ చారి, సాంబయ్య, మల్లారెడ్డి, చంద్రయ్య, శ్రీనివాస్ రెడ్డి, ఇటుకల కరుణాకర్, షాపూర్ మహేందర్, సంజీవరావు, రాజు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కరువు కోరల్లో తెలంగాణ.. రైతులను ఆదుకోవాలి!

- రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలి: కూనంనేని







ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 3 (పీసీడబ్ల్యూ న్యూస్): వర్షాభావంతో పంటలు ఎండిపోతున్నాయని, చెరువులు, కుంటల్లో నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణను తక్షణమే కరువు రాష్ట్రంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.మంగళవారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్ల, కొణిజర్ల గ్రామాల్లో సీపీఐ బృందంతో కలిసి కరువు పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరువు నివారణకు కేంద్రం రూ.25 వేల కోట్లు విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా తక్షణమే నిధులు కేటాయించి సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. గత ఏడాది 69.19 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, ఈ ఏడాది 57.04 లక్షల ఎకరాలకే పరిమితమైందని తెలిపారు.పంటలు సాగు చేయని రైతులను కూడా పరిహారం పరిధిలోకి తీసుకురావాలని, వరికి ఎకరాకు రూ.30 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుల రుణాలను రీషెడ్యూల్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న రుణమాఫీ అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీ పనులు పెంచడంతో పాటు కౌలు రైతులకు ప్రత్యేక సహాయం, పశుగ్రాసం, తాగునీటి సమస్యల పరిష్కారానికి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పర్యటనలో సీపీఐ, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు వామపక్ష శక్తుల ఐక్యత

- నవంబర్ 28 లేదా 30న ఢిల్లీలో జాతీయ ఐక్యతా సదస్సుకు ప్రతిపాదన



న్యూఢిల్లీ, నవంబర్ 4 (పీసీడబ్ల్యూ న్యూస్):రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, గణతంత్ర విలువల పరిరక్షణకు వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యత అవసరమని వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యవేదిక పేర్కొంది. దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటాలు నిర్మించేందుకు జాతీయ స్థాయిలో ఐక్య కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించింది.ఐక్యవేదిక కన్వీనర్ జస్టిస్ బి. చంద్రకుమార్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ప్రతినిధి బృందం నవంబర్ 2, 3 తేదీల్లో ఢిల్లీలో సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), ఫార్వర్డ్ బ్లాక్ తదితర పార్టీల జాతీయ నాయకులతో సమావేశమైంది. ఐక్య కార్యాచరణ, ప్రజా ఉద్యమాలు, జాతీయ సమన్వయ వేదిక ఏర్పాటుపై చర్చించగా నాయకుల నుంచి సానుకూల స్పందన లభించిందని తెలిపింది.ఈ నేపథ్యంలో నవంబర్ 28 లేదా 30న న్యూఢిల్లీలో జాతీయ ఐక్యతా సదస్సు నిర్వహించాలని ప్రతిపాదించింది. వామపక్ష పార్టీలతో పాటు అంబేద్కరిస్టు, బహుజన, మైనారిటీ, కార్మిక, రైతు, విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజాతంత్ర సంస్థలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చింది. పార్టీల స్వతంత్రతను గౌరవిస్తూ ప్రజా సమస్యలపై ఉమ్మడిగా పనిచేయడమే లక్ష్యమని ఐక్యవేదిక స్పష్టం చేసింది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

- తుఫాను ముప్పు వేళ రైతులను ఇబ్బంది పెట్టడం తగదు..

ఎమ్మెల్యే తీరుపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం





కమలాపూర్, నవంబర్ 3 (పీసీడబ్ల్యూ న్యూస్):హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అడ్డుకుంటున్నారని మండల కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. పది రోజులుగా రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసి కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారని, తుఫాను వర్షాల ముప్పు పొంచి ఉన్నందున వెంటనే కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వస్తేనే కేంద్రాలు ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో కొనుగోళ్లు వాయిదా పడ్డాయని నాయకులు పేర్కొన్నారు. రైతులు రోడ్లపై, మార్కెట్ యార్డులో ధాన్యాన్ని కాపాడుకుంటూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడం కాకుండా రైతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ మేరకు ఎంపీడీవో గుండె బాబు, ఐకేపీ ఏపీఎంకు వినతిపత్రం అందజేసి కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తౌటం ఝాన్సీరాణి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పరకాలలో మహిళపై ఆరు నెలలుగా వేధింపులు.. కత్తితో చంపుతానని బెదిరింపు

• పని చేసే చోటుకు వెళ్లి అసభ్య ప్రవర్తన.. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

పరకాల, నవంబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):

పరకాల పట్టణంలో మహిళను గత ఆరు నెలలుగా వెంటపడుతూ వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై పరకాల పోలీసులు చర్యలు చేపట్టారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీ డ్రెస్సెస్ షాప్‌లో పనిచేస్తున్న భర్తను కోల్పోయిన మహిళను కొమ్ముల శ్రీనివాస్ (30) అనే వ్యక్తి కొంతకాలంగా వెంటపడుతూ, ఇష్టంలేని సంబంధం పెట్టుకోవాలని ఒత్తిడి చేస్తూ వేధిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.వేధింపులు భరించలేక బాధితురాలు తన పని స్థలాన్ని మార్చుకున్నప్పటికీ నిందితుడి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో అక్టోబర్ 28న ఉదయం 11 గంటల సమయంలో మార్కెట్ సమీపంలోని ఆమె పనిచేస్తున్న కిరాణా దుకాణం వద్దకు వెళ్లి అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు చేతులతో దాడి చేసి, కత్తి చూపిస్తూ చంపుతానని బెదిరించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె కుటుంబ సభ్యులను సైతం బెదిరించినట్లు తెలిపారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు పరకాల పోలీసులు కేసును స్వీకరించి, నిందితుడిపై చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టారు.

కష్టకాలంలో తోడుండటమే నిజమైన స్నేహం

- ఆప్తుడి కుటుంబానికి అండగా నిలిచిన స్నేహబంధం

- టైలర్ కోట రవి మృతికి ఘన నివాళి.. కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్) : స్నేహబంధం అంటే సంతోషాల్లోనే తోడుగా ఉండటం కాదు.. కష్టకాలంలోనూ ఆప్తుల కుటుంబానికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని ఫ్రెండ్స్ ఫౌండేషన్ (ఎఫ్2) సభ్యులు చాటుకున్నారు. అనారోగ్యంతో మృతి చెందిన తమ ఆత్మీయ మిత్రుడు టైలర్ కోట రవికి ఘనంగా నివాళులర్పిస్తూ, ఆయన కుటుంబానికి అండగా నిలిచారు.మంగళవారం రవి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించిన ఎఫ్2 సభ్యులు.. ఆయన మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆత్మీయుడిని కోల్పోయిన కుటుంబ సభ్యుల బాధను పంచుకుంటూ, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా రవి లేని లోటు ఎవరూ తీర్చలేనిదని, అయితే కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ఏ ఆపద వచ్చినా తామంతా అండగా ఉంటామని భరోసా కల్పించారు. మాటలతోనే పరామర్శించి వెళ్లిపోకుండా.. చేతల్లోనూ తమ స్నేహబంధంలోని గొప్పతనాన్ని చాటుకున్నారు. ఫ్రెండ్స్ ఫౌండేషన్ (ఎఫ్2) తరఫున రవి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి, కష్టసమయంలో ఆ కుటుంబానికి తోడుగా నిలిచారు. స్నేహితుడిపై ఉన్న అభిమానాన్ని, ఆయన కుటుంబం పట్ల తమకున్న బాధ్యతను ఈ సహాయంతో చాటుకున్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన స్నేహానికి నిదర్శనమని, మానవత్వంతో చేసే చిన్న సహాయం కూడా బాధిత కుటుంబానికి కొండంత ధైర్యాన్నిస్తుందని ఈ సందర్భంగా ఎఫ్2 సభ్యుల సేవాభావం మరోసారి నిరూపించింది.ఈ కార్యక్రమంలో కె.వి. నరసింహారావు, బి. శంకరాచారి, ఎం.డి. కరీముల్లా, వి. పాపారావు, బి. రామారావు, ఎస్.కె. పెంటు సాహెబ్, కె. రాము, వి. వెంకటేశ్వర్లు, సమ్మయ్య, ఎం. వీరన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై సర్పంచుల నిరసన.. అధికారుల తీరుపై ఆగ్రహం

- రోడ్ల పనులు వెంటనే చేపట్టాలి..

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో సర్పంచులకు సమాచారం ఇవ్వాలి




కమలాపూర్, నవంబర్ 3 (పీసీడబ్ల్యూ న్యూస్):హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గుండె బాబు అధ్యక్షతన మంగళవారం వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలో బెల్టు దుకాణాల నిర్వహణ, రహదారుల నిర్మాణంలో జాప్యంపై సర్పంచులు అధికారులను నిలదీశారు. గ్రామాల్లో మద్య నిషేధానికి తీర్మానాలు చేసినా బెల్టు దుకాణాలు పెరుగుతున్నాయని, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.మంజూరైన రహదారుల పనులను వెంటనే ప్రారంభించాలని, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సర్పంచులు కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల ద్వారానే జరగాలని, సర్పంచులకు తెలియకుండా ఇళ్లు మంజూరు చేయవద్దని స్పష్టం చేశారు. రైతు బీమా కొనసాగించాలని, రైతుల సమస్యలపై స్పందించాలని





వ్యవసాయ అధికారులను కోరారు. విద్యుత్ శాఖ సిబ్బంది బతుకమ్మ పండుగ సందర్భంగా అందించిన సేవలను సర్పంచులు అభినందించారు.సమావేశంలో పాల్గొన్న జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శేషాద్రి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల సమస్యల పరిష్కారానికి అధికారులు అందుబాటులో ఉంటారని హామీ ఇచ్చారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




రాత్రి 10 గంటలైనా తెరిచే ఉన్న ఎంపీడీవో కార్యాలయం!

- ప్రభుత్వ కార్యాలయంలో అర్ధరాత్రి వేళ ఏం జరుగుతోంది? విధుల నిర్వహణపై ప్రజల్లో అనుమానాలు.. అధికారుల వివరణ ఏది?

మల్లంపల్లి నవంబర్ 3 (పి.సి.డబ్ల్యూ న్యూస్): మల్లంపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం రాత్రి 10 గంటలు దాటినా తెరిచి ఉండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సాధారణ కార్యాలయ వేళలు ముగిసినప్పటికీ కార్యాలయ తలుపులు తెరిచి ఉండటంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాత్రి వేళల్లో కార్యాలయంలో ఏ పనులు నిర్వహిస్తున్నారు? ఏ అధికారి పర్యవేక్షణలో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి? అన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల పనితీరులో పారదర్శకత ఉండాలని కోరుతున్న ప్రజలు, రాత్రి వేళల్లో కార్యాలయం తెరిచి ఉండటానికి గల కారణాలను సంబంధిత అధికారులు వెల్లడించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వడంతో పాటు ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్, వరంగల్ పోలీస్ కమిషనర్‌ను కలిసిన గుజరాత్‌లో పర్యటించిన జిల్లా బృందం

- జిల్లా టీంను అభినందించిన జిల్లా కలెక్టర్,పోలీస్ కమిషనర్



హనుమకొండ/కమలాపూర్ నవంబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్): గుజరాత్ రాష్ట్రంలోని నర్మదా జిల్లా ఏక్తా నగర్ లో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోది ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా ఏక్తా దివస్ ఫరడ్ లో పాల్గొన్న కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ గౌడ్ సహా పాల్గొన్న జిల్లా బృందం సభ్యులు మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్,వరంగల్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత రెడ్డి లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏక్తా దివస్ పరడ్ విశేషాలు వారికి వివరించారు.ఈ సందర్భంగా జిల్లా బృందం ను జిల్లా కలెక్టర్,పోలీస్ కమిషనర్ అభినందించారు.



ఐసీసీ యాంటీ డోపింగ్ నిబంధనల ఉల్లంఘన..

ఐర్లాండ్ క్రికెటర్‌పై సస్పెన్షన్ వేటు!

ప్రిస్క్రిప్షన్ మందుల వినియోగంలో నిబంధనల ఉల్లంఘన.. తప్పిదాన్ని అంగీకరించిన రెబెక్కా స్టోకెల్.. ఐసీసీ విచారణ పూర్తయ్యే వరకు ఆటకు దూరం



డబ్లిన్: ఐర్లాండ్ మహిళా క్రికెటర్ రెబెక్కా స్టోకెల్ ఐసీసీ యాంటీ డోపింగ్ నిబంధనలను ఉల్లంఘించినట్లు అంగీకరించడంతో స్వచ్ఛంద సస్పెన్షన్‌కు అంగీకరించారు. ప్రిస్క్రిప్షన్ మందుల వినియోగానికి సంబంధించిన నిబంధనలు పాటించకపోవడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) క్రమశిక్షణా విచారణ చేపట్టింది. 2026 జూన్ 23న పోటీల సమయంలో నిర్వహించిన డోపింగ్ పరీక్షలో ఆమె నమూనాలో నిర్దిష్ట పదార్థం ఉన్నట్లు తేలింది. అనంతరం ఐసీసీ నుంచి సమాచారం అందడంతో తన తప్పిదాన్ని ఆమె అంగీకరించారు. అక్టోబర్ 23 నుంచి స్వచ్ఛంద సస్పెన్షన్‌లోకి వెళ్లారు. విచారణ పూర్తయ్యే వరకు ఆమెపై ఈ నిషేధం కొనసాగనుంది. **పోటీ ప్రయోజనం కోసం కాదు..** తాను వినియోగించిన మందు ఆటలో అదనపు ప్రయోజనం పొందేందుకు ఉపయోగించినది కాదని, ఈ ఉల్లంఘన అనుకోకుండా జరిగిందని రెబెక్కా వెల్లడించారు. అయినప్పటికీ యాంటీ డోపింగ్ మార్గదర్శకాలను పాటించాల్సిన బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు. తన తప్పును పూర్తిగా అంగీకరిస్తున్నానని, వీలైనంత త్వరగా తిరిగి ఐర్లాండ్ జట్టుకు ఆడాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. **109 అంతర్జాతీయ మ్యాచ్‌లు** 26 ఏళ్ల రెబెక్కా 2017లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశారు. ఇప్పటివరకు ఐర్లాండ్ తరఫున 29 వన్డేలు, 80 టీ20లు కలిపి మొత్తం 109 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడారు. ఈ ఘటనపై ఐసీసీ తుది నిర్ణయం వెల్లడించాల్సి ఉంది. క్రమశిక్షణా విచారణ ముగిసిన తర్వాతే ఆమెపై విధించే శిక్షాకాలంపై స్పష్టత రానుంది.

భువనేశ్వర్ కుమార్ కెరీర్‌కు ముగింపు పలికినట్లేనా?

- న్యూజిలాండ్ సిరీస్‌లో పేలవ ప్రదర్శన.. భువీపై అశ్విన్ కీలక వ్యాఖ్యలు.. షమీకి జట్టులో అవకాశం ఇవ్వాలని సూచన



న్యూఢిల్లీ: భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ అంతర్జాతీయ క్రికెట్ భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. న్యూజిలాండ్‌తో ఇటీవల ముగిసిన ఐదు టీ20ల సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో అతడి కెరీర్‌పై చర్చ మొదలైంది. నాలుగేళ్ల విరామం తర్వాత భారత జట్టులోకి తిరిగొచ్చిన భువీ తన పునరాగమనాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడని మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. **ఐపీఎల్ ఫామ్.. అంతర్జాతీయ స్థాయిలో కరువు!** ఐపీఎల్-2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున భువనేశ్వర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 16 మ్యాచ్‌ల్లో 28 వికెట్లు తీసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతోనే నాలుగేళ్ల తర్వాత భారత టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు. అయితే న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో మాత్రం తన ఐపీఎల్ ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయాడు. నాలుగు మ్యాచ్‌ల్లో కేవలం ఒక వికెట్ మాత్రమే తీసి, ఓవర్లకు 11.50 పరుగుల చొప్పున సమర్పించుకున్నాడు. **భువీ పునరాగమనం కష్టమే: అశ్విన్** తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడిన అశ్విన్.. ఐపీఎల్‌లో కనిపించిన బౌలింగ్ వేగం, తీవ్రత న్యూజిలాండ్ సిరీస్‌లో కనిపించలేదని పేర్కొన్నాడు. భువీ తన ఫామ్‌ను నిరూపించుకోలేకపోయాడని, ఐపీఎల్, అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి బౌలింగ్ మధ్య చాలా తేడా ఉందని వ్యాఖ్యానించాడు. అతడి భారత జట్టు అధ్యాయం బహుశా ముగిసినట్లేనని, తిరిగి జట్టులోకి రావడం చాలా కష్టమని అభిప్రాయపడ్డాడు. **షమీకి అవకాశం ఇవ్వాలి** మరోవైపు సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ ప్రస్తుత ఫామ్‌పై అశ్విన్ ప్రశంసలు కురిపించాడు. రంజీ ట్రోఫీలో షమీ నిలకడగా వికెట్లు తీస్తూ మంచి లయలో ఉన్నాడని తెలిపాడు. ప్రస్తుతం భువనేశ్వర్‌తో పోలిస్తే షమీ మెరుగైన బౌలింగ్ లయలో ఉన్నాడని, సెలక్టర్లు అతడి పేరును పరిశీలించాలని సూచించాడు. దీంతో భువీ అంతర్జాతీయ కెరీర్ కొనసాగింపుపై ఆసక్తికర చర్చ మొదలైంది.

మైదానంలో విషాదం.. గోల్‌కీపర్‌తో ఢీకొని స్పెయిన్ ఫుట్‌బాలర్ మృతి!

గోల్ కోసం పోరాడుతూ తీవ్ర ప్రమాదం.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత.. 30 ఏళ్ల ఆటగాడి మృతితో ఫుట్‌బాల్ ప్రపంచంలో విషాదం



మాడ్రిడ్: స్పెయిన్ ఫుట్‌బాల్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మ్యాచ్ ఆడుతుండగా ప్రత్యర్థి జట్టు గోల్‌కీపర్‌తో ఢీకొన్న టెనెరిఫే క్లబ్ ఆటగాడు జీసస్ డి మిగ్వెల్ (30) మృతి చెందాడు. సోమవారం జరిగిన స్పెయిన్ రెండో డివిజన్ మ్యాచ్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకోగా, మంగళవారం ఉదయం చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. **మైదానంలోనే కుప్పకూలిన ఆటగాడు** టెనెరిఫే, ఎఫ్‌సీ అండోరా జట్ల మధ్య మ్యాచ్ జరుగుతున్న సమయంలో చివరి నిమిషాల్లో బంతిని అందుకునేందుకు డి మిగ్వెల్ ముందుకు దూసుకెళ్లాడు. అదే సమయంలో అండోరా గోల్‌కీపర్ జీసస్ ఒవోనో తన గోల్‌పోస్ట్ నుంచి బయటకు వచ్చి బంతిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఇద్దరూ బలంగా ఢీకొనడంతో డి మిగ్వెల్ ఛాతీకి తీవ్ర గాయమై మైదానంలోనే స్పృహ కోల్పోయాడు. వెంటనే వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో మ్యాచ్‌ను నిలిపివేశారు. గోల్‌కీపర్‌కు రెడ్‌కార్డు చూపించారు. **చికిత్స పొందుతూ మృతి** ప్రమాదం తర్వాత డి మిగ్వెల్‌కు గుండె స్పందన ఆగిపోవడంతో వైద్యులు అత్యవసర చికిత్స అందించి స్పందనను పునరుద్ధరించారు. అనంతరం ఆస్పత్రిలోని అత్యవసర విభాగంలో చేర్చి చికిత్స అందించారు. తొలుత అతడి పరిస్థితి నిలకడగా ఉందని క్లబ్ ప్రకటించినప్పటికీ, ఆ తర్వాత నాడీ సంబంధిత పరిస్థితి విషమించింది. చివరకు మంగళవారం ఉదయం 8 గంటలకు మరణించినట్లు టెనెరిఫే క్లబ్ అధికారికంగా వెల్లడించింది. **ఫుట్‌బాల్ ప్రపంచం సంతాపం** డి మిగ్వెల్ మృతిపై టెనెరిఫేతో పాటు ఎఫ్‌సీ అండోరా, బార్సిలోనా, రియల్ మాడ్రిడ్ తదితర క్లబ్‌లు సంతాపం వ్యక్తం చేశాయి. స్పెయిన్ ఫుట్‌బాల్ సమాఖ్య కూడా నివాళిగా మంగళవారం జరగాల్సిన కోపా డెల్ రే, కోపా డెల్ రీనా మ్యాచ్‌లను వాయిదా వేసింది. 2025లో టెనెరిఫే జట్టులో చేరిన డి మిగ్వెల్ మృతి ఫుట్‌బాల్ అభిమానులను కలచివేసింది.

వెంకట్ రెడ్డి నగర్ బీజేపీలో పదవుల పంచాయితీ

● డివిజన్ అధ్యక్ష పదవిపై తీవ్ర ఉత్కంఠ.. ఎవరికి దక్కేను పీఠం.? ● పార్టీ కోసం జెండా మోసిన కార్యకర్తలకే ప్రాధాన్యత ఇవ్వాలి ● మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌ను కాదని ఎంపీ ఈటల వద్ద పైరవీలంటూ పార్టీలో చర్చ



ఉప్పల్ అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్): ఉప్పల్ నియోజకవర్గంలోని వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ బీజేపీలో అధ్యక్ష పదవి వ్యవహారం రాజకీయ వేడిని రాజేస్తోంది. డివిజన్ అధ్యక్ష పీఠాన్ని దక్కించుకునేందుకు పలువురు నేతలు పోటీ పడుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. పదవి ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ స్థానిక కార్యకర్తల్లో నెలకొంది. పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడిన వారిని పక్కనపెట్టి, పలుకుబడి, పైరవీలతో పదవులు దక్కించుకోవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా పార్టీ బలోపేతానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్‌ను సంప్రదించకుండా, ఆయన ప్రాధాన్యతను పక్కనపెట్టి నేరుగా ఎంపీ ఈటల రాజేందర్ వద్ద పైరవీలు సాగిస్తున్నారన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒక గల్లీ స్థాయి నాయకుడు స్థానిక మాజీ ఎమ్మెల్యే నాయకత్వాన్ని పక్కనపెట్టి తన పలుకుబడిని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. **పార్టీకి పనిచేసిన వారిని పక్కనపెడతారా.?** పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వకుండా, ఎన్నికల సమయంలో పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించి బీఆర్ఎస్ పార్టీకి పనిచేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల పైరవీలకు తలోంచి పదవులు కట్టబెడితే క్షేత్రస్థాయిలో పార్టీకి నష్టం తప్పదని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన వారికి కాకుండా పైరవీలు చేసేవారికి పదవులు దక్కితే కార్యకర్తల్లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. బీజేపీ అధిష్ఠానం ఇప్పటికైనా క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి, నిజాయితీగా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు అవకాశం కల్పించాలని స్థానిక నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. పైరవీలకు ప్రాధాన్యత ఇస్తారా.? పార్టీ కోసం పోరాడిన వారికి పట్టం కడతారా.? అన్నది వేచి చూడాల్సిందే.

సెలెక్టర్ల తీరుపై సర్ఫరాజ్ ఖాన్ అసంతృప్తి!

- వరుసగా పరుగులు చేస్తున్నా జట్టులో చోటేది? విదేశీ గడ్డపైనా సెంచరీలు సాధించా ప్రతిసారీ కష్టపడటానికి కారణమేంటని ఆవేదన



ముంబై: భారత టెస్టు జట్టులో చోటు దక్కకపోవడంపై యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా పరుగులు సాధిస్తున్నప్పటికీ సెలెక్టర్లు తనను పట్టించుకోవడం లేదని ఆవేదన చెందాడు. భారత జట్టులోకి రావడానికి ప్రతిసారీ కష్టపడుతున్నా అవకాశాలు రాకపోవడంతో కొన్నిసార్లు ఎందుకు ఇంత కష్టపడాలని తనను తాను ప్రశ్నించుకుంటున్నానని తెలిపాడు. **విదేశాల్లోనూ పరుగులు సాధించా!** తనను భారత పరిస్థితుల్లో మాత్రమే ఆడగల బ్యాటర్‌గా చూస్తున్నారని సర్ఫరాజ్ పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికాలో భారత్-ఏ తరఫున 63 బంతుల్లో సెంచరీ, ఇంగ్లండ్‌లో 76 బంతుల్లో శతకం సాధించిన విషయాన్ని గుర్తుచేశాడు. విదేశీ గడ్డపై కూడా పరుగులు చేయగల సామర్థ్యం తనకు ఉందని స్పష్టం చేశాడు. అయితే సెలెక్టర్ల ఆలోచన వారి నిర్ణయమని, తన పని క్రికెట్ ఆడటమేనని పేర్కొన్నాడు. **తండ్రే తనకు స్ఫూర్తి** 2024లో న్యూజిలాండ్‌తో చివరిసారిగా భారత్ తరఫున టెస్టు ఆడిన సర్ఫరాజ్.. ఇటీవల శ్రీలంక పర్యటనకు ఎంపికైనా తుది జట్టులో అవకాశం దక్కించుకోలేకపోయాడు. న్యూజిలాండ్‌తో భారత్-ఏ పర్యటనకు కూడా ఎంపిక కాలేదు. అయినప్పటికీ దేశవాళీ క్రికెట్‌లో రాణించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. తన తండ్రి నౌషాద్ ఖాన్ కష్టపడుతున్న తీరు చూసి ప్రతిరోజూ ఉదయం ఐదు గంటలకే సాధనకు వెళ్తున్నానని చెప్పాడు. **22 కిలోల బరువు తగ్గిన బ్యాటర్** ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టిన సర్ఫరాజ్ తన బరువును 97 కిలోల నుంచి 77 కిలోలకు తగ్గించుకున్నాడు. ఎవరూ ప్రత్యేకంగా చెప్పకపోయినా తన ఆటతీరును మెరుగుపరుచుకోవాలనే ఉద్దేశంతో ఈ మార్పు చేసుకున్నట్లు వెల్లడించాడు. ముంబై తరఫున రంజీ ట్రోఫీలో రైల్వేస్‌తో జరిగిన మ్యాచ్‌లో 55 పరుగులు సాధించాడు. భారత జట్టులో అవకాశం వచ్చినా, రాకపోయినా క్రికెట్ ఆడటం మాత్రం కొనసాగిస్తానని స్పష్టం చేశాడు.

నిధుల కొరతతో భారత బ్యాడ్మింటన్ స్టార్లకు కష్టాలు!

సొంత డబ్బులతో యూరప్ టోర్నీలు ఆడిన సింధు, లక్ష్యసేన్

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిధులు నిలిపివేత.. ప్రయాణం, భోజనం, వసతి ఖర్చులూ ఆటగాళ్లపైనే.. కోచ్‌లు లేకుండానే బరిలోకి పలువురు షట్లర్లు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ వేదికలపై భారత కీర్తిప్రతిష్ఠలను పెంచుతున్న బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ఊహించని ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దేశం తరఫున ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో పాల్గొనేందుకు యూరప్ పర్యటనకు వెళ్లిన భారత షట్లర్లకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) నుంచి నిధులు అందకపోవడంతో సొంత డబ్బులతోనే పోటీల్లో పాల్గొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, స్టార్ షట్లర్ లక్ష్యసేన్ సహా పలువురు ఆటగాళ్లు ఈ సమస్యను ఎదుర్కొన్నారు. ఫిన్లాండ్, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో వరుసగా జరిగిన నాలుగు అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనేందుకు వెళ్లిన భారత బృందానికి ప్రయాణం, భోజనం, వసతి ఖర్చుల కోసం నిధులు అందకపోవడం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. **చివరి నిమిషంలో నిధులు నిలిపివేత** భారత బ్యాడ్మింటన్ బృందం అక్టోబర్ 6న ఫిన్లాండ్‌లోని వాంటాలో ప్రారంభమైన ఆర్కిటిక్ ఓపెన్ టోర్నీతో యూరప్ పర్యటనను ప్రారంభించింది. అయితే ఈ పోటీకి కొద్ది రోజుల ముందే పర్యటనకు అవసరమైన నిధులు విడుదల కావడం లేదని ఆటగాళ్లకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ ఆర్థిక ఏర్పాట్లు చేసుకునేందుకు కూడా వారికి తగిన సమయం లేకుండా పోయింది. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) మొదటి టోర్నీకి వసతి ఏర్పాట్లు చేస్తామని చెప్పినప్పటికీ, మిగిలిన పోటీలకు ప్రయాణం, భోజనం, బస తదితర ఖర్చులను ఆటగాళ్లే భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

‘రామాయణ‘ సినిమాకు భారీ ఊరట..

పైరసీపై బాంబే హైకోర్టు ఉక్కుపాదం



భారత సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ‘రామాయణ: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్‘ చిత్రానికి బాంబే హైకోర్టులో భారీ ఊరట లభించింది. సినిమా విడుదలకు ముందే పైరసీ భూతం నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ నిర్మాతలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, సినిమాను అనధికారికంగా రికార్డ్ చేయడం, స్ట్రీమింగ్ చేయడం, లేదా ఏ ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో హోస్ట్ చేయడాన్ని నిషేధిస్తూ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ చిత్రం ఈ నెల 5న విడుదల కానుంది.

గాడ్‌పవర్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. కాపీరైట్ హక్కుల ఉల్లంఘన జరగవచ్చనే బలమైన ఆందోళనతో వారు ‘ఆనంద్ అండ్ నాయక్‘ న్యాయ సంస్థ ద్వారా కోర్టును ఆశ్రయించారు. సినిమా స్క్రిప్ట్, పాత్రలు, ఫుటేజ్, పాటలు, రికార్డింగ్‌లతో సహా అన్ని అంశాలపై తమకు పూర్తి హక్కులు ఉన్నాయని, వాటిని కాపాడాలని పిటిషన్‌లో కోరారు. కేవలం ఆహ్వానితుల కోసం ప్రదర్శించిన రెండు ట్రైలర్లను కొందరు రహస్యంగా రికార్డ్ చేసి డిజిటల్ నెట్‌వర్క్‌లలో వ్యాప్తి చేశారని నిర్మాతలు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సినిమా మొదటి భాగాన్ని సుమారు రూ. 2,000 కోట్లతో, రెండు భాగాలను కలిపి మొత్తం రూ. 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నట్లు కోర్టుకు తెలిపారు. దీనిపై జస్టిస్ మాధవ్ జమ్దార్ నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ.. “నిర్మాతలకు నిజమైన, బలమైన ఆందోళనలు ఉన్నాయని ప్రాథమికంగా అర్థమవుతోంది“ అని వ్యాఖ్యానించింది. ఈ మేరకు గుర్తు తెలియని వ్యక్తులు, సంస్థలు సినిమాను పైరసీ చేయకుండా ‘డైనమిక్ ఇంజంక్షన్‘ ఉత్తర్వులు జారీ చేసింది.

అభ్యంతరకర లింకులు లేదా మిర్రర్ సైట్లను తమ దృష్టికి తెచ్చిన వెంటనే వాటిని బ్లాక్ చేయాలని లేదా తొలగించాలని ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు (ఐఎస్‌పీ), సోషల్ మీడియా సంస్థలను ఆదేశించింది. దీనిపై గూగుల్, ఇతర సోషల్ మీడియా సంస్థల ప్రతినిధులు కూడా అభ్యంతరం చెప్పలేదు.

వాల్మీకి మహర్షి రచించిన రామాయణం ఆధారంగా నితేష్ తివారీ ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. నమిత్ మల్హోత్రా, యశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా నటిస్తున్నారు. కేసు తదుపరి విచారణను డిసెంబర్ 16కి వాయిదా వేసిన కోర్టు, అప్పటివరకు ఈ మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది.

గేమింగ్ రంగంలోకి సూపర్ స్టార్..

షాట్‌గన్ గేమ్స్‌లో మహేశ్ బాబు పెట్టుబడి



ప్రముఖ సినీ నటుడు మహేశ్ బాబు మరో కొత్త వ్యాపార రంగంలోకి అడుగుపెట్టాడు. ఆయన తాజాగా గేమింగ్ పరిశ్రమలో పెట్టుబడిదారుడిగా మారాడు. ముంబైకి చెందిన ఇంటరాక్టివ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ‘షాట్‌గన్ గేమ్స్‘లో మహేశ్ వ్యూహాత్మక పెట్టుబడి పెట్టినట్టు ఆ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ కంపెనీ అంతర్జాతీయ మార్కెట్లను లక్ష్యంగా చేసుకుని పీసీ, కన్సోల్ గేమ్స్‌ను అభివృద్ధి చేస్తోంది.ఈ భాగస్వామ్యాన్ని షాట్‌గన్ గేమ్స్ సహ వ్యవస్థాపకులు జీత్ చందన్, విదిత్ మెహతా ధ్రువీకరించారు. ఈ ఒప్పందంలో భాగంగా అమెరికా, యూరప్, యూకే వంటి గ్లోబల్ మార్కెట్ల కోసం ‘బ్లేక్‌డౌన్ జెనెసిస్‘ పేరుతో ఒక యాక్షన్-అడ్వెంచర్ గేమ్‌ను రూపొందిస్తున్నట్టు తెలిపారు. ప్రముఖ దర్శకుడు విక్కీ అరోరా నేతృత్వంలో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నారు. ప్రపంచ స్థాయి పీసీ, కన్సోల్ గేమ్స్‌ను భారత్ కూడా తయారు చేయగలదని నిరూపించడమే తమ లక్ష్యమని కంపెనీ వ్యవస్థాపకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మహేశ్ బాబు మాట్లాడుతూ, దేశంలో సృజనాత్మక ప్రతిభకు ఎలాంటి కొదవ లేదని అన్నాడు. “కొత్త రంగంలోకి ప్రవేశించడం సంతోషంగా ఉంది. భారతీయ టాలెంట్‌పై నాకు పూర్తి నమ్మకం ఉంది“ అని ఆయన వ్యాఖ్యానించాడు. ఇప్పటికే సినిమా నిర్మాణం, థియేటర్లు, హెల్త్ అండ్ వెల్‌నెస్ వంటి పలు వ్యాపారాల్లో ఉన్న మహేశ్ బాబు, తాజాగా గేమింగ్ రంగంలోకి ప్రవేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ పెట్టుబడి విలువ ఎంత అనే వివరాలను ఇరుపక్షాలు

రాధికా ఆప్టే కామెంట్స్..

సినిమా ఒప్పుకునే ముందు తెలియదా?



తెలుగు సినిమా ఇండస్ట్రీపై బాలీవుడ్ హీరోయిన్లు విమర్శలు చేయడం కొత్తేమీ కాదు. గతంలో తాప్సీ చేసిన వ్యాఖ్యలు ఎంతటి వివాదానికి దారితీశాయో తెలిసిందే. ఇప్పుడు రాధికా ఆప్టే కూడా అలాంటి కామెంట్స్‌తో నెటిజన్ల నుంచి ప్రశ్నలు ఎదుర్కొంటున్నారు. అయితే ఈ వ్యవహారంలో హీరోయిన్ల అభ్యంతరాలను పూర్తిగా కొట్టిపారేయలేం. అదే సమయంలో సినిమాల్లో నటించడానికి అంగీకరించిన తర్వాత కొన్నేళ్లకు వాటిపై విమర్శలు చేయడాన్ని కూడా కొందరు తప్పుబడుతున్నారు. రాధికా ఆప్టే ఇటీవల అక్క ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. అందులో తన పాత్రను సొంత బంధువుతో పెళ్లికి సిద్ధం చేయడం, తనకంటే వయసులో చాలా పెద్ద హీరోతో నటించడం, సినిమా మధ్యలోనే పాత్రను చంపేయడం వంటి అంశాలను ప్రస్తావించారు. ఆమె అక్కడ ఏదో కామెడీగా, సినిమా నచ్చనట్లు అదే రొటీన్ అన్నట్లు హైలెట్ చేయడ ఓ వర్గం నెటిజన్స్ కు నచ్చడం లేదు. ఈ వ్యాఖ్యలపై కొందరు నెటిజన్లు స్పందిస్తూ అసలు కథ నచ్చనప్పుడు సినిమా ఎందుకు ఒప్పుకున్నారని ప్రశ్నిస్తున్నారు. హీరో ఎవరో, తన పాత్ర ఏంటో ముందే తెలుసుకునే అవకాశం ఉంటుంది కదా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. గతంలో తాప్సీ కూడా తెలుగు సినిమా షూటింగ్ అనుభవాలపై ఇలాంటి విమర్శలే చేశారు. తన నాభిపై కొబ్బరికాయ వేసి పాట చిత్రీకరించడాన్ని ఓ ఇంటర్వ్యూలో సరదాగా ప్రస్తావించడం అప్పట్లో వివాదమైంది. ఆ తర్వాత తన ఉద్దేశం దర్శకుడిని అవమానించడం కాదని వివరణ ఇచ్చారు. ఈ ఏడాది కూడా దక్షిణాది సినిమాల్లో హీరోయిన్ల గ్లామర్‌కు ఇచ్చే ప్రాధాన్యం, షూటింగ్ సమయంలో ఎదురైన ఇబ్బందుల గురించి మాట్లాడారు. ఇప్పుడు రాధికా వ్యాఖ్యలతో మరోసారి అలాంటి ప్రశ్నలే వినిపిస్తున్నాయి. అయితే నెటిజన్లు అడుగుతున్న ప్రశ్నలోనూ పాయింట్ ఉంది. కథలోని కొన్ని అంశాలు నచ్చకపోతే సినిమా ఒప్పుకునే ముందే అభ్యంతరం చెప్పవచ్చు. ముఖ్యంగా సీనియర్ హీరోతో నటించడం విషయంలో వయసు తేడా ముందే తెలిసే అవకాశం ఉంటుంది.

కానీ షూటింగ్ సమయంలో జరిగే ప్రతి విషయం ముందుగానే నటీనటులకు తెలుస్తుందని అనుకోలేం. కథ చెప్పినప్పుడు ఉన్న సన్నివేశాలు సెట్స్ మీదకు వెళ్లాక మారవచ్చు. కొన్ని సందర్భాల్లో దర్శకుడి నిర్ణయాలను వ్యతిరేకించే పరిస్థితి కూడా హీరోయిన్లకు ఉండకపోవచ్చు. ఒక సినిమాలో నటించినంత మాత్రాన అందులోని ప్రతి సన్నివేశాన్ని వ్యక్తిగతంగా సమర్థించినట్లు కాదు. అలాగే తనకు ఎదురైన అనుభవాన్ని చెప్పడం తప్పు కూడా కాదు. కానీ ఒకరిద్దరు దర్శకులతో ఎదురైన పరిస్థితులను మొత్తం తెలుగు ఇండస్ట్రీకి ఆపాదిస్తే మాత్రం అభ్యంతరాలు రావడం సహజం. ఎందుకంటే హీరోయిన్లకు మంచి పాత్రలు ఇచ్చిన దర్శకులు, మహిళా పాత్రలకు ప్రాధాన్యం ఇచ్చిన సినిమాలు కూడా తెలుగులో చాలానే ఉన్నాయి. రాధికా గతంలో తెలుగు సినిమా సెట్స్‌లో తనకు ఎదురైన ఇబ్బందులను చెప్పడంతో పాటు అక్కడి వ్యక్తులు తనను ఆప్యాయంగా చూసుకున్న సందర్భాలను కూడా గుర్తుచేసుకున్నారు. మరోవైపు స్థానిక నటీమణులకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలనే అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేశారు.

‘మెగా’ ఇంట్లో పెళ్లి బాజాలు.

. సాయి దుర్గా తేజ్ పెళ్లి ఫిక్స్?..

డిసెంబర్‌లో వివాహ ముహూర్తం?



టాలీవుడ్‌లో మరోసారి పెళ్లిళ్ల సందడి మొదలైంది. ఒకేసారి ఇద్దరు యువ హీరోల పెళ్లిళ్ల విషయంపై ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. మెగా హీరో సాయి దుర్గా తేజ్ త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నారని ప్రచారం జోరుగా సాగుతుండగా, మరో యంగ్ హీరో తేజ సజ్జా తన పెళ్లి వార్తను అధికారికంగా ప్రకటించారు.

మెగా కుటుంబంలో మరో పెళ్లి వేడుకకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. సాయి దుర్గా తేజ్ వివాహం చేసుకోబోతున్నారంటూ వస్తున్న వార్తలు అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ప్రచారం ప్రకారం, నవంబర్ 5న హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య సాయి తేజ్ నిశ్చితార్థం జరగనున్నట్లు సమాచారం. అయితే, ఆయన వివాహం చేసుకోబోయే అమ్మాయి వివరాలను చాలా గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఇక, డిసెంబర్ 10న వివాహం జరిపి, ఆ తర్వాత సినీ ప్రముఖుల కోసం ప్రత్యేకంగా రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సాయి తేజ్ ‘సంబరాల ఏటి గట్టు’ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ వార్తలపై మెగా కుటుంబం నుంచి గానీ, సాయి తేజ్ నుంచి గానీ అధికారిక ప్రకటన వస్తేనే పూర్తి స్పష్టత రానుంది.

టైగర్ ష్రాఫ్ ఘటన ఎఫెక్ట్..

భద్రతా వలయంలోకి బాలీవుడ్.. బిక్కుబిక్కుమంటున్న స్టార్లు!



బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ పై జరిగిన కాల్పుల ఘటన యావత్ సినీ పరిశ్రమను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ సంఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడిన సినీ ప్రముఖులు తమ భద్రతపై దృష్టి సారించారు. ఇప్పటికే పలువురు స్టార్లకు బెదిరింపులు వచ్చినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో, తాజాగా నటుడు తుషార్ కపూర్‌కు కూడా బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. అయితే, ఈ బెదిరింపులు నిజమా? లేక ఆకతాయిల పనా? అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో బాలీవుడ్‌లో భయానక వాతావరణం నెలకొంది.ఈ ఘటన తర్వాత సెలబ్రిటీల నుంచి భద్రత కవరేజీ కోసం డిమాండ్ పెరిగిందని నటుడు, ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వాహకుడు రోనిత్ రాయ్ ‘ఎన్డీటీవీ‘తో మాట్లాడుతూ ధ్రువీకరించారు. “ఇది నిజమే.. సెలబ్రిటీల నుంచి భద్రతను పెంచాలనే డిమాండ్ వస్తోంది. ఇదంతా ముందు జాగ్రత్త చర్యల్లో భాగమే. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా, సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నారు“ అని ఆయన వివరించారు. పలువురు ప్రముఖులకు భద్రత కల్పిస్తున్న సిబ్బంది కూడా కాల్పుల ఘటన తర్వాత తమ క్లయింట్ల భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు.

ఈ ఘటన పరిశ్రమలోని నటీనటులు, దర్శకులు, నిర్మాతల్లో భయాన్ని నింపిందని ‘ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్‘ (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) అధ్యక్షుడు బీఎన్ తివారీ అన్నారు. ఎన్డీటీవీతో ఆయన మాట్లాడుతూ.. “ప్రతి ఒక్కరూ భయపడుతున్నారు. ఎవరూ ఊహించని విధంగా ఈ ఘటన జరిగింది. పట్టపగలు, జనం మధ్యలో, పోలీస్ స్టేషన్ ముందే కాల్పులు జరగడం సహజంగానే భయాన్ని సృష్టించింది. కళాకారులు అందరూ అప్రమత్తంగా ఉన్నారు. ప్రాణం అందరికీ విలువైందే కాబట్టి ఈ భయం అందరిపైనా ప్రభావం చూపుతోంది“ అని అన్నారు.

“దీన్ని భయం అనడం కంటే, ముందు జాగ్రత్త చర్య అనడం సరైంది. అనవసరంగా బయట ప్రదేశాలకు వెళ్లడం, కారణం లేకుండా ఇతరులను కలవడం వంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండటం మంచిది“ అని తివారీ సూచించారు.భద్రత పెరిగిన విషయం ప్రముఖుల బహిరంగ కార్యక్రమాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతి ఆదివారం అభిమానులతో ముచ్చటించే అమితాబ్ బచ్చన్, ఈసారి తన జుహూ నివాసం వెలుపల ఒక బుల్లెట్‌ప్రూఫ్ గ్లాస్ ఎన్‌క్లోజర్ వెనుక నుంచి అభివాదం చేశారు. ఆయన కుమారుడు అభిషేక్ బచ్చన్ దగ్గరుండి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.నిన్న షారుఖ్ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నివాసం ‘మన్నత్‘ వద్ద కూడా భారీ భద్రతను ఏర్పాటు చేశారు. పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించి, అభిమానులను మొదట బంగ్లా దగ్గరకు అనుమతించలేదు. తర్వాత షారుఖ్ తన కుటుంబంతో కలిసి బెర్రస్‌పైకి వచ్చి, అభిమానులకు చాలా దూరం నుంచే అభివాదం చేశారు. సాధారణంగా చేసే విధంగా కాంపౌండ్ వాల్ దగ్గరకు రాలేదు.

ఇదిలా ఉంటే.. టైగర్ ష్రాఫ్ ఇంటి వద్ద కాల్పులకు పాల్పడిన షూటర్లు.. అమితాబ్ బచ్చన్, సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్, అక్షయ్ కుమార్ వంటి ఇతర స్టార్ల ఇళ్ల వద్ద కూడా రెక్కీ నిర్వహించినట్లు వచ్చిన నివేదికలు ఆందోళనను మరింత పెంచాయి. ఈ నేపథ్యంలో ఆల్ ఇండియా సినీయర్ వర్కర్స్ అసోసియేషన్ బాలీవుడ్ ప్రముఖులకు పటిష్ఠమైన భద్రత కల్పించాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసింది. మొత్తం మీద ఈ కాల్పుల ఘటన సినీ పరిశ్రమలో వ్యక్తిగత భద్రత అనే అంశాన్ని మరోసారి తీవ్రంగా చర్చకు తెచ్చింది.